ప్రతిపక్షం
www.prathipaksham.in

గురువారం 01.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 282 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

HAPPY NEW YEAR
2026
పాఠకులు, ప్రకటనకర్తలు, మిత్రులు శ్రేయోభిలాషులకు
నూతన సంవత్సర శుభాకాంక్షలు



సీఎం రేవంత్ శుభాకాంక్షలు

రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్య సాధన దిశగా ఈ ఏడాదిలో ప్రభుత్వం మరింత ముందుకు సాగుతుందన్నారు. రైతులు, మహిళలు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని, కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబం తాము ఆశించిన ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. ప్రజలందరూ ఆనందంతో, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.



సకల జనులు సుఖంగా ఉండాలి: కేసీఆర్

రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో, వ్యవసాయ, సాగునీటి రంగాలు గాడినపడి, అభివృద్ధి చెందాలని, తెలంగాణ రైతాంగం, మహిళలు, సకల జనులు, సుఖసంతోషాలతో జీవించాలని కేసీఆర్ కోరుకున్నారు. ప్రజాసమస్యల పరిష్కారం దిశగా, ప్రధాన ప్రతిపక్ష పార్టీగా, గత సంవత్సర కాలంగా బీఆర్ఎస్ పార్టీ నేతలు, శ్రేణులు పోరాడి సాధించిన విజయాలను ఈ సందర్భంగా కేసీఆర్ స్మరించుకున్నారు. తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకుంటూ యువత, పలు రంగాలకు చెందిన వృత్తి నిపుణులు, తెలంగాణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని కేసీఆర్ ఆకాంక్షించారు.



హ్యాపీ న్యూ ఇయర్

దేశ వ్యాప్తంగా అంబరాన్నంటిన సంబరాలు

- హైదరాబాద్‌లో యువత సందడి
- ముంబై, బెంగళూరు, ఢిల్లీలో హోరెత్తిన పార్టీలు
- రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్, బీఆర్ఎస్ అధినేత శుభాకాంక్షలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 31: దేశ వ్యాప్తంగా నూతన సంవత్సర సంబరాలు అంబరాన్నంటాయి. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ ప్రజలు 2026కు స్వాగతం పలికారు. హైదరాబాద్ తో పాటు దేశ వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. పబ్బులు, క్లబ్బులలో యువత ఆటపాటలతో సందడి చేశారు. కొంతమంది కుటుంబ సభ్యులతో కేక్‌కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. టపాకాయలు పేలుస్తూ న్యూ ఇయర్‌కు వెల్‌కమ్‌చెప్పారు. హైదరాబాద్‌లో ఈసారి న్యూ ఇయర్ వేడుకలు అంబరాన్ని అంటాయి. హైటెక్ సిటీ, గచ్చిబౌలి పరిసరాల్లోని క్లబ్‌లు, కన్వెన్షన్ సెంటర్లు విద్యుత్ దీపాల కాంతులతో మెరిసిపోయాయి. ముఖ్యంగా హైటెక్ అరేనాలో జరిగిన 'బిగ్ న్యూఇయర్ 2026' వేడుకకు వేలాదిమంది యువత తరలివచ్చారు. కినిటిక్ స్టేజ్ డిజైన్‌లు, అంతర్జాతీయ డీజేల సంగీతంతో భాగ్యనగరం హోరెత్తిపోయింది. ముంబయి లోని

...:: మిగతా 2లో

ఉద్యోగులకు

సర్కారు శుభవార్త



- కొత్త సంవత్సరంలో బకాయిలు చెల్లింపు
- పెండింగ్ బిల్లుల కోసం రూ.713కోట్లు విడుదల

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్31: ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభ వార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల కోసం 713 కోట్ల రూపాయలు విడుదల చేసింది. డిసెంబర్ మాసానికి సంబంధించిన బిల్లుల విడుదలకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఆర్థిక శాఖ ద్వారా బుధవారం 713 కోట్ల రూపాయల బిల్లులు విడుదల అయ్యాయి. మంగళవారం రాత్రి నుంచి సంబంధిత ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఉద్యోగ సంఘాలకు ప్రతినెల 700 కోట్ల రూపాయలు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం తెలిసిందే!. జూన్ నెలాఖరులో 183 కోట్ల రూపాయలు విడుదల చేసింది. ఆగస్టు నుంచి ప్రతినెల కనీసం 700 కోట్ల రూపాయల చొప్పున విడుదల చేస్తోంది. విడుదలైన బిల్లుల్లో గ్రాట్యూటీ, జీపీఎఫ్, సరెండర్ లీవ్, అడ్వాన్స్‌లు ఉన్నాయి.



మరొకరి జోక్యం లేనే లేదు

ఇండియా, పాకిస్థాన్ మధ్య ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. అయితే ఇండోపాక్ మధ్య శాంతి నెలకొల్పేందుకు తాము మధ్యవర్తిత్వం వహించినట్లు చైనా ప్రకటించింది. చైనా వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది.

7



భారత్ వైఖరిని తప్పబట్టిన జెలెన్‌స్కీ

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి చేసినట్లు వచ్చిన వార్తలను భారత్‌తో సహా పలు దేశాలు ఖండించిన విషయం తెలిసిందే. అయితే భారత ప్రధాని మోదీ చేసిన ఖండనను ఉక్రెయిన్ తప్పపట్టింది.

7



ఇంటి నిండా డబ్బే!

ఢిల్లీలోని ఓ ఇంటిపై ఈడీ అధికారులు దాడులను చేపట్టగా బంగారం, వజ్రాలు, కోట్ల రూపాయల నగదు కట్టలతో నిండిన సూట్‌కేసులు లభ్యమయ్యాయి. రూ.14 కోట్ల విలువజేసే సొత్తును ఈడీ స్వాధీనం చేసుకుంది.

7



ఆడా ఉంటా.. ఈడా ఉంటా

- జగ్గారెడ్డి వ్యాఖ్యలపై రాజకీయ వర్గాల్లో చర్చ
- యాదృచ్ఛికం కాదనే అభిప్రాయం
- బాబు, పవన్, జగన్లపై తీవ్ర విమర్శలు
- ఇక నుంచి ఏపీకి తరచుగా వస్తా
- ప్రజా సమస్యలపై పోరాడుతా
- ఏపీ పర్యటనలో జగ్గారెడ్డి ప్రకటన
- ఏపీ రాజకీయాల్లోకి వస్తున్నారా.?

చిటుకుల మైసారెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 31: కాంగ్రెస్ ఫైర్‌బ్రాండ్ నేత, తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చేసిన "ఆడా ఉంటా.. ఈడా ఉంటా" అన్న ఒక్క వాక్యం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. మొదట వినిపించినప్పుడు సాధారణ వ్యాఖ్యగా అనిపించినా, దాని వెనుక ఉన్న రాజకీయ అర్థాలు,

...:: మిగతా 2లో

ఇక 'కో ఆప్షన్' పదవుల వంతు

- పల్లెల్లో మళ్లీ మొదలైన రాజకీయ వేడి
- సర్పంచులు, ఎమ్మెల్యేల చుట్టే ఆశావహులు
- వార్డు వార్డు సభ్యులతో సమానమైన ప్రోటోకాల్
- ముగ్గురు సభ్యులకు అవకాశం
- భారీగా సాగుతున్న పైరవీలు
- త్వరలో నియామక ఉత్తర్వులు?



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్31: గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసి కొత్త పాలకవర్గాలు కొలువుదీరిన వేళ, పల్లెల్లో ఇప్పుడు 'కోఆప్షన్' సభ్యుల ఎంపిక చర్చనీయాంశంగా మారింది. దీంతో పల్లెల్లో మళ్లీ రాజకీయ వేడి మొదలైంది. పంచాయతీ పాలనలో భాగస్వామ్యం వహించే ముగ్గురు కో ఆప్షన్ సభ్యుల ఎంపికపై అందరి కన్ను పడింది. వార్డు సభ్యులతో సమానమైన ప్రోటోకాల్, గౌరవం ఉండటంతో ఈ పదవుల కోసం స్థానిక నాయకుల వద్ద భారీగా పైరవీలు సాగుతున్నాయి. పల్లె పాలనలో కీలక ఘట్టమైన పంచాయతీ ఎన్నికల కోలాహలం ముగిసింది. సర్పంచులు, ఉప సర్పంచులు తమ బాధ్యతలను స్వీకరించి అభివృద్ధి బాట పట్టారు. అయితే ఇప్పుడు గ్రామాల్లో రెండో విడత రాజకీయ వేడి మొదలైంది. అదే 'కోఆప్షన్' సభ్యుల నియామకం. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ప్రతి గ్రామంలో ముగ్గురు సభ్యులను కోఆప్షన్ పద్ధతిలో ఎంపిక చేయాల్సి ఉండటంతో ఆ పదవుల కోసం ఆశావహులు రంగంలోకి దిగారు.

కో-ఆప్షన్ సభ్యులకు ప్రత్యేక స్థానం

కోఆప్షన్ సభ్యులకు గ్రామ సభల్లో, పంచాయతీ సమావేశాల్లో ప్రత్యేక స్థానం ఉంటుంది. వార్డు సభ్యులతో సమానంగా వీరికి అధికారాలు, ప్రోటోకాల్ ఉంటుంది. గ్రామ అభివృద్ధికి సంబంధించి వీరు ఇచ్చే సలహాలు, సూచనలకు ప్రాధాన్యత ఉంటుంది. అయితే ఒక ముఖ్యమైన నిబంధన ఏమిటంటే.. వీరు సమావేశాలకు హాజరై చర్చల్లో పాల్గొనవచ్చు కానీ, ఏదైనా

...:: మిగతా 2లో

కరీంనగర్‌లో కవిత భూ పోరాటం

- తెలంగాణ ఉద్యమకారులతో కలిసి ఉద్యమం
- హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో భూములు వదలం.

ప్రతిపక్షం బ్యూరో కరీంనగర్

డిసెంబర్ 31:తెలంగాణ ఉద్యమకారులతో కరీంనగర్ జిల్లా మానకొండూరు పోలీస్ స్టేషన్ సమీపంలో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆక్రమించారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ లో తెలంగాణ ఉద్యమకారులతో కలిసి కవిత భూ పోరాటం చేపట్టారు. ఎక్కడికక్కడ భూములను ఆక్రమించుకోవాలని ఉద్యమకారులకు కవిత పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా మానకొండూరులో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయనున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, తెలంగాణ ఉద్యమకారులు బాసటగా నిలిచారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల చొప్పున ఇంటి స్థలం

...:: మిగతా 2లో





న్యూ ఇయర్ వేళ సమ్మెలో గిగ్ వర్కర్లు

దేశవ్యాప్తంగా బుధవారం గిగ్ వర్కర్లు సమ్మె చేపట్టారు. దీంతో నూతన సంవత్సర వేడుకల వేళ స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్, జెప్టో, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ తదితర సేవలకు కొంతమేర అంతరాయం ఏర్పడింది.

7



'వర్కర్ టు ఓనర్' పథకాన్ని

సంక్రాంతి లోగా అమలు చేయాలి

- లేకపోతే సిరిసిల్లలో 10 వేల మందితో మహా ధర్నా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

...:: 3లో

రాష్ట్రీయం





నూతన సంవత్సర వేడుకలు

హైదరాబాద్ బేగంపేటలోని ఐఏఎస్‌ఆఫీసర్స్ అసోసియేషన్ క్లబ్ లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీనియర్ ఐఏఎస్‌అధికారులు, అసోసియేషన్ సభ్యులు ఈవేడుకల్లో పాల్గొన్నారు.
ప్రతిపక్షం, హైదరాబాద్

హ్యాపీ న్యూ ఇయర్

మొదటిపేజీ తరువాయి

మెరైన్ డ్రైవ్ వద్ద వేలాది మంది అర్ధరాత్రి 12 గంటలకు ఆకాశంలో విరిసిన బాణసంచా వెలుగులను వీక్షించారు. అటు ఇండియన్ 'సిలికాన్ వ్యాలీ' బెంగళూరులో ప్యాలెస్ గ్రౌండ్స్ వేదికగా జరిగిన భారీ సంగీత కచేరీలు యువతను ఉర్రూతలూగించాయి. దిల్లీలో చలి తీవ్రత ఉన్నప్పటికీ, కన్నాట్ ప్లేస్ సహా వివిధ ఫైవ్ స్టార్ హోటళ్లలో జరిగిన థీమ్ పార్టీలు అదిరిపోయాయి. గోవాలో 2026 ఆరంభం సందర్భంగా అంజునా, బాఘా బీచ్‌లు పర్యాటకులతో కిక్కిరిసిపోయాయి. విదేశీ పర్యాటకుల తాకిడి ఈసారి గణనీయంగా పెరిగింది. రాత్రంతా సాగిన బీచ్ పార్టీలు, ఫైర్ డ్యాన్సులు గోవా తీరాన్ని మరో ప్రపంచంగా మార్చేశాయి. కేరళలోని కొచ్చిలో 'పప్పాంజీ' దహనం చేసే సంప్రదాయం ఈసారి కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాత ఏడాదికి వీడ్కోలు పలుకుతూ దుష్టశక్తుల దహనానికి చిహ్నంగా నిర్వహించే ఈ వేడుకను చూడటానికి వేలాది మంది తరలి వచ్చారు. మరోవైపు, వారణాసిలోని గంగా తీరంలో వేలాది దీపాలతో గంగా హారతి ఇచ్చి, ఆధ్యాత్మిక మార్గంలో కొత్త ఏడాదికి స్వాగతం పలికారు భక్తులు. వేడుకల నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా నిర్వహించారు. మొత్తానికి, 2026 నూతన సంవత్సర వేడుకలు భారతీయుల ఆత్మవిశ్వాసాన్ని, ఆనందాన్ని ప్రతిబింబించాయి.

ఇక 'కో ఆప్షన్' పదవుల వంతు

మొదటిపేజీ తరువాయి

అంశంపై తీర్మానం చేసేటప్పుడు ఓటు వేసే హక్కు వీరికి ఉండదు. కేవలం సలహాదారులుగా మాత్రమే వీరి పాత్ర పరిమితం. సాధారణంగా మున్సిపాలిటీలు, మండల పరిషత్‌లలో మైనారిటీలకు కోఆప్షన్ పదవులు దక్కుతాయి. కానీ గ్రామ పంచాయతీల్లో నిబంధనలు భిన్నంగా ఉన్నాయి. ఆ ముగ్గురు సభ్యులు ఈ క్రింది వర్గాల నుంచి ఉండాలి. గ్రామ సమాఖ్య అధ్యక్షురాలిని ఎంపిక చేయాలి. మహిళా సంఘాల బలోపేతం కోసం, మహిళా సాధికారత ప్రతినిధిగా ఆమెకు ఒక స్థానం దక్కుతుంది. ప్రభుత్వ కార్యకలాపాలు, జీవోలు, పాలనా పరమైన అంశాలపై పట్టు ఉన్న ఒక విశ్రాంత ఉద్యోగిని సభ్యుడిగా ఎంపిక చేయాలి. దీనివల్ల పంచాయతీ నిర్ణయాల్లో చట్టపరమైన ఇబ్బందులు లేకుండా చూసే అవకాశం ఉంటుంది. గ్రామాభివృద్ధి కోసం గ్రామ పంచాయితీ కి భూమిని దానం చేసిన వారు, భారీగా విరాళాలు ఇచ్చిన దాతలు లేదా గ్రామ అభివృద్ధికి తోడ్పడే ఎన్ఆర్‌ఐలకు ఈ మూడవ స్థానాన్ని కేటాయించాలి.

పైరవీల్లో ఆశావహులు

ఈ పదవుల ఎంపికలో స్థానిక సర్పంచ్, ఎమ్మెల్యేల నిర్ణయం కీలకం కావడంతో ఆశావహులు తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగిస్తున్నారు. వార్డు సభ్యులుగా పోటీ చేసి స్వల్ప ఓట్లతో ఓడిపోయిన వారు, ఎన్నికల్లో సర్పంచ్ విజయం కోసం ఆర్థికంగా, అంగబలంతో సహకరించిన అనుచరులు, పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేస్తున్న సీనియర్ కార్యకర్తలు, వీరంతా తమకు ఎలాగైనా ఈ గౌరవప్రదమైన పదవిని కట్టబెట్టాలని నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. గ్రామాల్లో ఇప్పటికే ఎవరిని ఎంపిక చేస్తారనే దానిపై రచ్చబండల వద్ద జోరుగా బెట్టింగ్‌లు, చర్చలు సాగుతున్నాయి.

త్వరలో అధికారిక ఉత్తర్వులు?

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం త్వరలోనే ఈ నియామక ప్రక్రియ పూర్తి కానుంది. పంచాయతీ నిధులను వినియోగించడం, అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయడంలో ఈ ముగ్గురు సభ్యుల పాత్ర కీలకం కానుంది. ఎంపికైన వారు గ్రామాభివృద్ధికి తోడ్పడతారా లేక కేవలం రాజకీయ పునరావాసంగా ఈ పదవులు మిగిలిపోతాయా అనేది వేచి చూడాలి.



ఆ లింక్‌లతో జాగ్రత్త

- హ్యాపీ న్యూ ఇయర్‌వేళ ఫోన్లకు సైబర్ నేరగాళ్ల లింకులు
- ప్రజలకు పోలీసులు హెచ్చరిక

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 31: 2025 సంవత్సరానికి వీడ్కోలు పలికి కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్న వేళ ఫోన్లకు సైబర్ నేరగాళ్లు లింకులు పంపుతారని, వాటిపై జాగ్రత్తగా ఉండాలంటూ పోలీసులు హెచ్చరిస్తున్నారు. పాత సంవత్సరానికి వీడ్కోలు, కొత్త సంవత్సరానికి శుభాకాంక్షలు అంటూ సైబర్ నేరగాళ్లు లింకులు పంపుతారని వారు తెలిపారు. కొత్త సంవత్సరం వేళ పోలీసులు ఇప్పటికే పలు హెచ్చరికలు కూడా జారీ చేశారు. అర్ధరాత్రి రోడ్లపై తిరగవద్దని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడవద్దంటూ వార్నింగ్ ఇచ్చారు. ఇప్పుడు మాత్రం నూతన సంవత్సరం సందర్భంగా వచ్చే మెసేజ్‌లపై జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరిస్తున్నారు పోలీసులు. న్యూఇయర్ విషెస్ పేరిట వచ్చే లింక్ మెసేజ్ మోసాలపై హెచ్చరికలు జారీ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా సైబర్ నేరగాళ్లు 'హ్యాపీ న్యూ ఇయర్' శుభాకాంక్షలు, గిఫ్ట్ లు, ఆఫర్ల పేరుతో వాట్సప్‌లో నకిలీ లింక్‌లను ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

ఒకసారి నొక్కితే అంతే...

ఒకసారి ఇన్స్టాల్ అయిన తర్వాత ఆ మాల్వేర్ ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలు, కాంటాక్ట్స్, ఫోటోలు, వాట్సాప్ ప్రాప్యతను దొంగిలించగలదన్నారు. దీంతో నేరగాళ్లు మీ పేరుతో ఇతరులను మోసం చేసే అవకాశం ఉందన్నారు. ఈ లింక్‌లు తరుచుగా పరిచయమైన వ్యక్తులు లేదా కుటుంబ గ్రూపుల ద్వారా ఫార్వర్డ్ అవుతాయని.. అందువల్ల అవి నిజమైనవిగా అనిపిస్తాయన్నారు. యాప్ ఇన్స్టాల్ చేయమని లేదా అప్‌డేట్ చేయమని కోరే శుభాకాంక్షలు/గిఫ్ట్ లింక్లపై ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.



పటాన్ చెరు కేంద్రంగానే సర్కిల్ కార్యకలాపాలు

- జిహెచ్ఎంసి కమిషనర్ ను కోరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 31 : దశాబ్దాల చరిత్రతో పాటు నియోజకవర్గ కేంద్రంగా కలిగిన పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిహెచ్ఎంసి పటాన్ చెరు సర్కిల్ కార్యాలయాన్ని స్థానికంగానే కొనసాగించాలని లేనిపక్షంలో ప్రజలతోపాటు పాలనాపరంగా తీవ్ర ఇబ్బందులు నెలకొంటాయని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ ను పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. బుధవారం హైదరాబాదులోని బల్దియా ప్రధాన కార్యాలయంలో జిహెచ్ఎంసి కమిషనర్ తో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమావేశమయ్యారు. బల్దియా పునర్విభజన ప్రక్రియలో భాగంగా పటాన్ చెరు కేంద్రంగా ఏర్పాటుచేసిన బల్దియా సర్కిల్ కార్యాలయాన్ని ఇటీవల పరిపాలన సౌలభ్యం పేరుతో తెల్లాపూర్ పరిధిలోని మున్సిపల్ కార్యాలయం లోకి మార్చారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ కేంద్రంతోపాటు ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు మొత్తం పటాన్చెరు కేంద్రంగా సేవలు అందిస్తున్నాయని సర్కిల్ కార్యాలయాన్ని తెల్లాపూర్ కి మార్చడం ద్వారా పరిపాలనాపరంగా ఇబ్బందులతో పాటు పటాన్ చెరు, జేపీ కాలనీ, ముత్తంగి డివిజన్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. పరిపాలన పరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా.. ఆధునిక వసతులతో ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా గతంలోనే పటాన్చెరు పట్టణంలో సర్కిల్ కార్యాలయాన్ని నిర్మించామని తెలిపారు. నూతన సర్కిల్ ఏర్పడే వరకు సైతం పటాన్చెరు కేంద్రంగానే పాత సర్కిల్ కార్యకలాపాలు కొనసాగాయని తెలిపారు.



కరీంనగర్‌లో కవిత భూ పోరాటం

మొదటిపేజీ తరువాయి

ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ మరిచిందన్నారు. ఇంటి స్థలాల హామీని డిసెంబర్ 9వ తేదీలోగా నెరవేర్చకుంటే భూ పోరాటాలకు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో కరీంనగర్ నుంచి భూ పోరాటానికి శ్రీకారం చుట్టారు. భూ పోరాటం ప్రారంభించడానికి ముందు అల్గునూరు చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఒక్క కరీంనగర్ లో మాత్రమే కాదు అన్ని జిల్లాల్లో ప్రభుత్వం ఉద్యమకారులకు ఇస్తామన్న 250 గజాల భూమి ఇచ్చే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో విలువైన భూములను కూడా వదలమని హెచ్చరించారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు ఇక్కడ నుంచి కదిలేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమం పాల్గొన్న వారిలో జాగృతి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు లకవత్ రూప్ సింగ్, జాగృతి జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్, ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు కనకం కుమారస్వామి, జాగృతి జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, అక్కం శివరాణి, యండి సల్మ, జంగ అపర్ణ, జాగృతి నాయకులు రంగరవేణి లక్ష్మణ్, కుతాడి శ్రీనివాస్ కొత్తురి రఘు, శ్రీరాముల రమేష్, బుడిగే పర్శరం గౌడ్, చంటి శ్రీనివాస్, హుస్నబాద్ రాజ్ కుమార్, హుసేన్, యాకుబ్, ఉద్యమకారుల ఫోరం నాయకులు ఐలా ప్రసన్న, కొమ్మిటి తిరుమల, గోశెట్టి సంజీవ్, కరుపాల నున్న కనకం శెంకర్, పదిగాలా రవీందర్ రెడ్డి, ల్యగల బాపిరెడ్డి, దేవునూరి అంకుష్, గరిగే కోటేష్, సిరిశెట్టి భాగ్య, జవ్వాజి శెంకర్ తదితరులు పాల్గొన్నారు.



పరిశుభ్ర నగరంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దాలి

- పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా చేపట్టాలి
- జోనల్, డిప్యూటీ కమిషనర్లకు కమిషనర్ ఆదేశం

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 31: పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా చేపడుతూ గ్రేటర్ హైదరాబాద్ ను పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దాలని జోనల్, డిప్యూటీ కమిషనర్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ విభాగం ఇంజనీర్లకు కమిషనర్ ఆర్వీ కర్ణన్ సూచించారు. బుధవారం గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా చేపట్టిన జీహెచ్ఎంసీ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మూడోరోజు రోడ్లకు ఇరువైపుల క్లీనింగ్ , డివైడర్లు, సెంట్రల్ మీడియం ,కెర్బ్ ల క్లీనింగ్ నిర్వహించారు. శంషాబాద్ జోనల్ పరిధిలో ఆదిభట్ల, కొంగర కలాన్, బోంగుళూరు లలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం అమలును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మొదటి రోజు ఫుట్ ఓవర్ బ్రిడ్జి క్లీనింగ్ చేపట్టగా, రెండో రోజు ఫ్లై ఓవర్ల క్లీనింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ, గ్రేటర్ హైదరాబాద్ నగరంలో పారిశుధ్యం మరింతగా మెరుగుపరచడానికి జోనల్, డిప్యూటీ కమిషనర్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ విభాగం ఇంజనీర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో చెరువులు, నాలాలు,ఫుట్ పాత్‌లు, పార్కులు, నిర్మాణ-కూల్చివేత వ్యర్థాల తొలగింపు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వద్ద పేరుకుపోయిన చెత్త తొలగింపు వంటి కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం పారిశుధ్య కార్యక్రమాలు ప్రభావవంతంగా చేపట్టాలన్నారు. కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ చంద్రకళ తదితరులు ఉన్నారు.

ఆడా ఉంటా.. ఈడా ఉంటా

మొదటిపేజీ తరువాయి

భవిష్యత్ వ్యూహాలు ఇప్పుడు తెలంగాణతో పాటు జాతీయ రాజకీయాల్లోనూ ఆసక్తికరంగా మారాయి. పార్టీలో కొనసాగుతున్న అంతర్గత సమీకరణలు, బాధ్యతల పునర్వ్యవస్థీకరణ, నాయకత్వ పాత్రలపై చర్చ జరుగుతున్న తరుణంలో ఈ వ్యాఖ్యలు రావడం యాదృచ్ఛికం కాదన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. పార్టీ కోసం ఎక్కడైనా పనిచేయడానికి సిద్ధమనే భావనను ఈ ఒక్క వాక్యంతో జగ్గారెడ్డి బలంగా చెప్పినట్టుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తనను పక్కన పెట్టినా రాజకీయంగా వెనక్కి తగ్గబోనన్న సంకల్పం, అవసరమైతే మరింత దూకుడుగా పోరాడతానన్న ఆత్మవిశ్వాసం ఈ వ్యాఖ్యల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఇది ఒకరకంగా కాంగ్రెస్ హైకమాండ్‌కు పంపిన పరోక్ష రాజకీయ సంకేతంగా కూడా అర్థం చేసుకుంటున్నారు.

ఏపీ పర్యటనతో..

ఈ వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యం తెచ్చింది జగ్గారెడ్డి ఇటీవల చేసిన ఆంధ్రప్రదేశ్ పర్యటన. రెండు రోజుల పాటు ఏపీ లో ఆయన చేసిన రాజకీయ దాడులు రాష్ట్ర రాజకీయాలను ఒక్కసారిగా వేడెక్కించాయి. అధికార, ప్రతిపక్షం అన్న తేడా లేకుండా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, వైఎస్ జగన్‌లపై ఆయన తీవ్ర విమర్శలు చేయడం గమనార్హం. కేంద్రంలో ఎన్డీఏతో పొత్తులో ఉన్నప్పటికీ ఏపీకి న్యాయం జరగడం లేదని, ప్రత్యేక హోదా అంశాన్ని పూర్తిగా పక్కన పెట్టేశారని ఆయన ఆరోపించారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ విషయంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక మరిచిపోయారని పవన్ కళ్యాణ్‌పై జగ్గారెడ్డి విరుచుకుపడ్డారు. "మోదీని కౌగిలించుకోవడం తప్పు చేసింది ఏముంది?" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా సంచలనంగా మారాయి. అదే సమయంలో వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని కూడా వదలలేదు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా రెండు ప్రధాన పార్టీలు ఆంధ్ర ప్రజలను మోసం చేస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు.

జగ్గారెడ్డి ఏపీ రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నారా?

ఈ మొత్తం పరిణామాలతో జగ్గారెడ్డి ఏపీ రాజకీయాల్లోకి ఉద్దేశపూర్వకంగా అడుగు పెడుతున్నారా? అన్న ప్రశ్నలు మొదలయ్యాయి. ప్రస్తుతం ఏపీ కాంగ్రెస్ బలహీన స్థితిలో ఉండటం, ప్రజల్లో పార్టీ ప్రభావం తగ్గిపోవడంతో, కాంగ్రెస్‌ను మళ్లీ పునర్నిర్మించేందుకు హైకమాండ్ కొత్త వ్యూహానికి తెరతీసిందన్న వాదన వినిపిస్తోంది. ఈ వ్యూహంలో భాగంగానే జగ్గారెడ్డి లాంటి దూకుడు నేతను ముందుకు తెస్తున్నారా? అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది. ఇందుకు తోడు ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంపై పార్టీలోనే అసంతృప్తి ఉందన్న ప్రచారం కూడా బలంగా వినిపిస్తోంది. ఆమె వల్ల పార్టీకి లాభం కన్నా నష్టం ఎక్కువ జరుగుతోందన్న అభిప్రాయం హైకమాండ్‌కు కూడా చేరిందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జగ్గారెడ్డి ఏపీ రాజకీయాల్లో చురుగ్గా కనిపించడం, షర్మిలకు ప్రత్యామ్నాయంగా లేదా పక్కనే మరో పవర్ సెంటర్‌ను కాంగ్రెస్ రూపొందిస్తోందన్న అనుమానాలకు దారి తీస్తోంది.జగ్గారెడ్డి మాత్రం తన రాజకీయ లక్ష్యాన్ని స్పష్టంగా చెప్పుకొచ్చారు. "ఏపీ ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ ఉంది. రాహుల్ గాంధీని ప్రధానిగా చేసుకుందాం" అంటూ ఆయన చేసిన పిలుపు, కాంగ్రెస్‌ను మళ్లీ ప్రజల పార్టీగా నిలబెట్టాలన్న ప్రయత్నంగా కనిపిస్తోంది. ఇక నుంచి తరచూ ఏపీకి వస్తానని, ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై పోరాటం చేస్తానని ఆయన ప్రకటించడం, ఈ రాజకీయ కదలికలు తాత్కాలికం కాదన్న సంకేతాలు ఇస్తోంది. మొత్తంగా చూస్తే, "ఆడా ఉంటా.. ఈడా ఉంటా" అన్న జగ్గారెడ్డి వ్యాఖ్య కేవలం భావోద్వేగపూరిత డైలాగ్ కాదు. ఇది కాంగ్రెస్‌లో తన ఉనికిని, అవసరాన్ని, భవిష్యత్ పాత్రను స్పష్టంగా గుర్తు చేసిన రాజకీయ ప్రకటనగా విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణలో అధికార పార్టీగా కాంగ్రెస్ తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలన్నా, ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ పూర్వవైభవం సాధించాలన్నా, ఇలాంటి పోరాట పటిమ ఉన్న నేతల పాత్ర కీలకమవుతుందన్న అభిప్రాయం బలపడుతోంది. రానున్న రోజుల్లో జగ్గారెడ్డి రాజకీయ అడుగులు ఏ దిశగా సాగుతాయో, ఆయన వ్యాఖ్యలు మాటల వరకే పరిమితమవుతాయో, లేక కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ సమీకరణలకు నాంది పలుకుతాయో అన్నది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠగా మారింది.

"



ఓటర్ లిస్ట్‌లో అవకతవకలతో ఓట్ చోరీ జరుగుతోంది, ఈవీఎంల ద్వారా కాదు. బెంగాల్‌లో ఎస్ఐఆర్‌తర్వాత ఎలక్టోరల్ రోల్స్‌పై పార్టీల అనుమానాలను నివృత్తి చేయడంలో ఎలక్షన్ కమిషన్ ఫెయిలైంది. ఓటర్ల సంఖ్యలో తేడాలుంటే ఫైనల్ ఓటర్ లిస్ట్‌ను టీఎంసీ అంగీకరించదు. లీగల్‌గా పోరాడుతుంతాం.
- టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ



'వర్కర్ టు ఓనర్' పథకాన్ని

సంక్రాంతి లోగా అమలు చేయాలి

- లేకపోతే సిరిసిల్లలో 10 వేల మందితో మహా ధర్నా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్/ సిరిసిల్లా , డిసెంబర్ 31: సంక్రాంతి లోపలే 'వర్కర్ టు ఓనర్' పథకాన్ని ప్రారంభించాల్సిందేనని, సంక్రాంతి లోపలే ఆసాముల లిస్టును ఫైనల్ చేసి, అర్హులైన నేత కార్మికులకు లెటర్లు కేటాయించాలని, లేకుంటే పదివేల మందితో మహాధర్నా కార్యక్రమాన్ని చేపడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. 'వర్కర్ టు ఓనర్' పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లుగా ఉద్దేశపూర్వకంగా తాత్సారం చేస్తూ, పూర్తిస్థాయిలో నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించిందని ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం సంక్రాంతి లోపలే ఈ పథకాన్ని ప్రారంభించాల్సిందే అని స్పష్టం చేశారు. ఈ పథకం సమర్థవంతంగా అమలవ్వాలంటే, గతంలో రూపొందించిన ప్రణాళికలకు అనుగుణంగా పవర్ లూమ్‌లను సబ్సిడీపై కొనుగోలు చేయడానికి అవసరమైన నిధులను వచ్చే బడ్జెట్ లో పూర్తిస్థాయిలో కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే సంక్రాంతి లోపలే ఆసాముల లిస్టును ఫైనల్ చేసి, అర్హులైన నేత కార్మికులకు లెటర్లు కేటాయించాలి అని కోరారు. ఒకవేళ సంక్రాంతి లోపల ఈ ప్రక్రియ పూర్తిచేయకపోతే, సంక్రాంతి అనంతరం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సిరిసిల్లలోని నేతన్నలు, నేత కార్మికులందరినీ సమీకరించి ఆందోళనకు దిగుతామన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో ఉన్న మూడంచెల వ్యవస్థను అధ్యయనం చేయాలని కేసీఆర్ అధికారులను ఆదేశించారని, కార్మికులు-ఆసాములు-సేట్లు అనే వ్యవస్థలో కార్మికుడు కార్మికుడిగానే మిగిలిపోవాల్సిన పరిస్థితి ఎందుకు ఉండాలని ప్రశ్నిస్తూ, కార్మికుడిని ఆసామిగా మార్చే విప్లవాత్మక ఆలోచనతో 'వర్కర్ టు ఓనర్' కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ఇది దేశంలోనే కాక, బహుశా ప్రపంచంలోనే ఎక్కడా లేని వినూత్న పథకమని పేర్కొన్నారు. కనీసం 1,500 మంది నేత కార్మికులను ఆసాములుగా, అపెరల్ పార్కులో 25,000 మంది మహిళలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు రూపకల్పన జరిగిందని గుర్తుచేస్తూ, సంక్రాంతి లోపల చర్యలు తీసుకోకపోతే ఉద్యమం తప్పదని బీఆర్ఎస్ మరోసారి స్పష్టంగా హెచ్చరించింది.

కొత్త సంవత్సరం ఆనందం తీసుకురావాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



2026 నూతన సంవత్సరం సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం ప్రతి కుటుంబానికి ఆరోగ్యం, ఆనందం, శాంతి, సమృద్ధి తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రజల విశ్వాసంతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, సమానత్వం అనే లక్ష్యాలతో మరింత వేగంగా పనిచేస్తుందన్నారు. ప్రతి గ్రామానికి మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన రహదారులు, యువతకు ఉపాధి అవకాశాలు, రైతులకు భరోసా కల్పించే విధానాలతో తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కొత్త సంవత్సరం ప్రజల ఆశలు, ఆకాంక్షలను సాకారం చేసే సంవత్సరంగా నిలవాలని, ప్రజలందరి సహకారంతో తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

రోడ్డు భద్రతా ఉత్సవాల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్31: జనవరి 1 వ తేదీ నుండి జరిగే జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ రవాణా శాఖ పక్షాన జనవరి 1 నుండి 31 వరకు రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాల్లో రోడ్డు భద్రత మాసోత్సవం కార్యక్రమంలో పాల్గొనాలని మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు. ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రులతో రోడ్డు బద్రత నిబంధనలు పాటిస్తామని హామీ పత్రం ఇవ్వాలని, ప్రతి పాఠశాల రోడ్ భద్రతా క్లబ్లో చేరాలని ఆయన అన్నారు. రవాణా శాఖ సూచనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనం నడపరాదని, రాంగ్ రూట్లో ప్రయాణం వద్దని, అతివేగంతో వాహనం నడపరాదని మంత్రి పొన్నం కోరారు. రోడ్డు ప్రమాదాల వల్లే మరణాలు అధికంగా సంభవిస్తున్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు ,అధికారులు , విద్యార్థులు,ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని అన్నారు.



ఓటర్ల మ్యాపింగ్ వారం లోపు పూర్తి చేయాలి

- భూభారతి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 31: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా చేపడుతున్న ఓటర్ల మ్యాపింగ్‌ను వేగవంతం చేసి వారం రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్డీవోలు, తహసిల్దార్లు, ఎన్నికల విభాగపు అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి ఓటర్ మ్యాపింగ్ పురోగతి, భూభారతి దరఖాస్తుల స్థితిగతులను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, బి ఎల్వోలు, బిఎల్వో సూపర్వైజర్ల సమన్వయంతో ఫీల్డ్ స్థాయిలో ఓటర్ మ్యాపింగ్ వేగవంతం చేయాలని సూచించారు.ఏ ఈ ఆర్ ఓ వారిగా రోజువారీ పురోగతి నివేదికలు తీసుకొని రెగ్యులర్‌గా సమీక్షించాలని ఆర్డీవోలకు సూచించారు. జాప్యం జరగకుండా వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించాలని తహసిల్దార్లకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. పూర్తి పారదర్శకంగా భూభారతి చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాధురి, సబ్ కలెక్టర్ ఉమా హారతి, రెవిన్యూ డివిజనల్ అధికారులు, తహసిల్దార్లు, ఎన్నికల విభాగపు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



జానారెడ్డిని పరామర్శించిన సీఎం

మాజీ మంత్రి కుందూరు జానారెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల మోకాలి శస్త్ర చికిత్స అనంతరం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న జానారెడ్డిని సీఎం రేవంత్ బుధవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.

ప్రతిపక్షం, హైదరాబాద్



పకడ్బందీగా పంచాయితీ ఎన్నికలు నిర్వహించాం

- సిబ్బంది, అధికారులను అభినందించిన కలెక్టర్

ప్రతిపక్షం, రంగారెడ్డి, డిసెంబర్31: బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీ శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలల్లో తమకు కేటాయించిన విధులను ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిర్వహించి విజయవంతంగా నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం, ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా కింది స్థాయి నుండి పై అధికారుల వరకు ప్రతి ఒక్కరూ ఎంతో నిబద్ధతతో పని చేయడం ద్వారా ఎన్నికలను విజయవంతంగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఎన్నికలలో భాగస్వాములైన ప్రతి ఒక్కరినీ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందించారు. రాబోయే ఎన్నికలలో కూడా ఇదే విధంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించుటకు జిల్లా కలెక్టర్ గారు ముందుండి దిశానిర్దేశం చేయడం వలనే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించి విజయవంతం అయ్యేలా చేయడం జరిగినదని ఈ సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, శ్రీనివాస్, డీఆర్ఓ సంగీత, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేశ్ మోహన్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, తహసిల్దారులు, తదితరులు పాల్గొన్నారు



విద్యుత్ స్తంభాల నాణ్యత విషయంలో

రాజీ పడే ప్రసక్తే లేదు

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబర్ 31: విద్యుత్ పంపిణీ వ్యవస్థ బలోపేతానికి , వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి విద్యుత్ స్తంభాల నాణ్యత అత్యంత కీలకమని టీజీఎన్పీడీసీఎల్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన వరంగల్ ఫున్నెల్ రోడ్ లోని స్వర్ణ , ఉజ్వల స్థంబాల తయారీ కేంద్రలతో పాటు, బీబీ నగర్ గూడూరులోని మంచుకొండ స్థంబాల తయారీ కేంద్రాలలో క్షేత్రస్థాయిలో సందర్శించి, తయారీ ప్రక్రియను కూలంకశంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తయారీ యూనిట్లలో జరుగుతున్న పనులను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. స్తంభాల మన్నికను నిర్ధారించే పలు సాంకేతిక అంశాలపై సీఎండీ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సీఎండీతో పాటు చీఫ్ ఇంజనీర్ కె . తిరుమల్ రావు , ఎస్ ఈ సివిల్ వెంకటేశ్వర్లు ఇంజనీరింగ్ అధికారులు, తయారీ కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇరికించబోయి.. ఇరుక్కున్నాడు

- ఐబొమ్మ రవి మామూలోడు కాదు
- వెలుగులోకి సంచలన విషయాలు..



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్31: ఐబొమ్మ రవి పైరసీ కేసులో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. రిమాండ్ రిపోర్ట్‌లో పలు కీలక విషయాలను హైదరాబాద్ పోలీసులు ప్రస్తావించారు. పైరసీతో 13 కోట్ల 40 లక్షలు వచ్చాయని పోలీసుల కస్టడీ విచారణలో రవి ఒప్పుకున్నాడు. రవికి ఉన్న 7 బ్యాంకు ఖాతాల్లో ఈ మొత్తం సొమ్ము డిపాజిట్ అయింది. ఆన్లైన్ బెట్టింగ్ యాడ్స్ ద్వారా ఒకసారి ఏకంగా ఒక కోటి 78 లక్షలు వచ్చాయని కూడా విచారణలో తేలింది. ట్యాక్స్ ఇబ్బందులు రాకూడదని తన సోదరి చంద్రికకు 90 లక్షలు పంపాడు. అలాగే లావాదేవీలు మొత్తాన్నీ విదేశీ కరెన్సీ రూపంలోనే చేశాడు. కొంతకాలం పాటు కూకట్‌పల్లి ఉషా ముళ్లపూడి దగ్గరలో ఒక ఆఫీస్ నడిపాడు. పది మందిని నియమించుకుని రవి పైరసీ చేయించాడు. ఓ విదేశీయుడి ద్వారా ట్రేడ్ మార్క్ లైసెన్స్ పొందాడు. రవి రెండు రకాలుగా సినిమాలు కొనుగోలు చేశాడని పోలీసుల కస్టడీ రిపోర్ట్ చెబుతోంది. లావాదేవీలన్నీ డాలర్ల రూపంలోనే చేసిన రవి.. బెట్టింగ్, పైరసీ ద్వారా వచ్చిన డబ్బుతో జల్సాలు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇక ఒక్కో సినిమాకు క్యామ్ కార్డర్ ప్రింట్‌కు 100 డాలర్లు, హెచ్ డీ ప్రింట్‌కు 200 డాలర్లను రవి చెల్లించాడని పోలీసులు అంటున్నారు. కోవిడ్ తరువాత తన బిజినెస్ మెరుగుపడిందని రవి పోలీసులకు వివరించాడు. ఆన్లైన్లో సినిమాలు చూసే వారి సంఖ్య కొవిడ్ తర్వాత పెరిగిందన్నాడు. దాంతో తనకు బాగా డబ్బులొచ్చాయని రవి ఒప్పుకున్నాడు. 12 రోజుల కస్టడీలో రవి చెప్పిన వివరాలను పోలీసులు కోర్టుకు సమర్పించారు.

రాష్ట్ర ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసుంబర్ 31: రాష్ట్ర ప్రజలకు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.2025 సంవత్సరంలోని తీపి జ్ఞాపకాలు, సాధించిన అంశాలను గుర్తుచేశారు. ఈ 2026 నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికి మరిన్ని విజయాలు సాధించాలని ప్రార్థించారు. కొత్తసంవత్సరం ప్రతి కుటుంబానికి ఆరోగ్యం, ఆనందం, శాంతి, సమృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రజా పాలన ప్రభుత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో యువతకు మరిన్ని అవకాశాలు పెరిగి, రైతులు, కార్మికులు, మహిళలు, విద్యార్థులు అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ముందుకు సాగాలని కోరుకుంటున్నానని అన్నారు. అందరం ఐక్యతతో, ఆశావహ దృక్పథంతో కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ, రాష్ట్ర ప్రగతికి కలిసికట్టుగా కృషి చేద్దామని పేర్కొన్నారు.

హైదరాబాద్‌పై సీఎం రేవంత్ రెడ్డికి ద్వేషం

- 'ఫోర్త్ సిటీ' అనే ఊహల్లో సీఎం ఉన్నారు
- మూసీ ప్రక్షాళన పేరుతో ఇష్టారాజ్యంగా కూల్చివేతలు
- అసెంబ్లీ కనీసం 15 రోజులు నిర్వహించాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివేకానంద, సంజయ్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 31: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైదరాబాద్ నగరంపై చిన్న చూపు ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడుతూ, సీఎం మొదటి నుంచీ హైదరాబాద్‌ను "చెత్త నగరం"గా చూస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ అభివృద్ధిని విస్మరించి 'ఫోర్త్ సిటీ' అనే ఊహల్లో సీఎం ఉన్నారని, రాయదుర్గం నుంచి శంషాబాద్ వరకు ప్రతిపాదిత మెట్రో ప్రాజెక్టును రద్దు చేశారని తెలిపారు. మూసీ ప్రక్షాళన పేరుతో ఇష్టారాజ్యంగా కూల్చివేతలు చేపట్టారని, నగరంపై సీఎం ద్వేషం, కోపంతో వ్యవహరిస్తున్నారని అన్నారు. నగర కాలుష్యాన్ని తగ్గించేందుకు బీఆర్ఎస్ హయాంలో నిర్ణయించిన ఫార్మా సిటీని రద్దు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాకపోవడం ప్రజల తీర్పేనని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నుంచి మంత్రిని చేయాలని కోరితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ద్వారా అజహరుద్దీన్‌ను మంత్రి చేశారని, ఆయనకు నగరంపై పూర్తి అవగాహన లేదని విమర్శించారు. మహేశ్వరం, మేడ్చల్, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల నియోజకవర్గాల గ్రామాలను జీహెచ్ఎంసీలో కలిపి ప్రజలకు అన్యాయం చేస్తున్నారని, 27 శివారు మున్సిపాలిటీల విలీనంపై ప్రజలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోలేదని ఆరోపించారు. మంత్రులు, అధికారులు, మేయర్‌కు కూడా తెలియకుండా డివిజన్ల సంఖ్యను 300కు పెంచడం నియంతృత్వ పాలనకు నిదర్శనమని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో జీహెచ్ఎంసీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 30 అవార్డులు వచ్చాయని, ప్రపంచ గ్రీన్ సిటీ అవార్డు, స్వచ్ఛ ఎక్సలెన్స్ అవార్డులు అందుకున్నదని గుర్తుచేశారు. సీఎం నిర్ణయాలను కాంగ్రెస్ కార్పొరేటర్లు, నేతలే వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ఇక అసెంబ్లీ వ్యవహారాలపై డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం తెలంగాణ అసెంబ్లీ కేవలం 16 రోజులు మాత్రమే నడిచిందని విమర్శించారు. ఇంగ్లాండ్ పార్లమెంట్ సంవత్సరానికి 160 రోజులు నడుస్తుందని స్పీకర్ చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తూ, శీతాకాల సమావేశాలను కనీసం 15 రోజులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో వ్యక్తిగత దూషణలు, బూతులు పెరిగాయని, జీరో అవర్ అర్థం లేకుండా మారిందని అన్నారు. రాష్ట్రంలో ఆసుపత్రుల పరిస్థితి దారుణంగా ఉందని, కేటీఆర్, హరీష్ రావు మాట్లాడుతుంటే మంత్రులు అడ్డుపడటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని వ్యాఖ్యానించారు. అసెంబ్లీని ప్రభుత్వం హుందాగా నడపాలని, వ్యక్తిగత విమర్శలను స్పీకర్ అడ్డుకోవాలని కోరారు. 2025 సంవత్సరంలో ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



విద్యార్థి హక్కుల కోసం ఎస్ఎఫ్ఐ పోరాటం

- ఘనంగా ఎస్ఎఫ్ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- జెండా ఆవిష్కరించిన రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్.

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 31: విద్యార్థి పోరాటాల వేగుచుక్కగా నిలిచిన భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మొయినాబాద్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావాన్ని స్మరిస్తూ విప్లవ వీరుడు భగత్సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జెండాను రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ 1970 సంవత్సరంలో కేరళ రాష్ట్రం త్రివేంద్రంలో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో 'అధ్యయనం పోరాటం' నినాదంతో ప్రారంభమైందన్నారు. నేడు దేశవ్యాప్తం గా 30 లక్షల సభ్యత్వంతో అతి పెద్ద విద్యార్థి సంఘంగా ఎదిగిందన్నారు. దేశంలో చదువుతున్న ప్రతి విద్యార్థికీ నాణ్యమైన, శాస్త్రీయమైన, ఉచిత విద్య అందాలనే లక్ష్యంతో ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మతోన్మాద బీజేపీ ప్రభుత్వం విద్యార్థులకు వ్యతిరేకంగా నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తూ అశాస్త్రీయమైన, చరిత్రను వక్రీకరించే విద్యను ప్రవేశపెడుతోందని తీవ్రంగా విమర్శించారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండేండ్లు గడిచినా విద్యాశాఖకు మంత్రి నియమించకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. తక్షణమే రాష్ట్రానికి పూర్తి స్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించి, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లు, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్ , ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల్ అధ్యక్ష కార్యదర్శులు , రేశ్వంత్, చరణ్ గౌడ్, ఉపాధ్యక్షులు , ఎండి. ఇర్ఫాన్, చేవెళ్ల మండల అధ్యక్ష కార్యదర్శులు, ఇర్ఫాన్, మాల చందు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



> ఏపీ ప్రణాళికలను అడ్డుకొని రాష్ట్ర నీటి వాటాను పరిరక్షించాం. గోదావరి నీళ్ల మళ్లింపును అంగీకరించం. ఏకపక్షంగా మళ్లించేందుకు ప్రయత్నిస్తే సహించే ప్రసక్తే లేదు. వారి నిర్ణయం సీడబ్ల్యూసీ, జీడబ్ల్యూడీటీ తీర్పునకు భిన్నంగా ఉంది. అదనపు నీటి హక్కుల కోసం ఏపీ రూపొందించిన ప్రణాళికలకు వ్యతిరేకంగా ప్రభుత్వం న్యాయ పోరాటానికి పూనుకుంది. ప్రతిపక్షాల ఆరోపణల్లో వాస్తవం లేదు.
>
> - రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్

ఓపెన్ వాయిస్

అన్నదమ్ముల కలయిక..

మరాఠా రాజకీయాల్లో ప్రకంపనలు

మహారాష్ట్ర రాజకీయాల్లో ఊహించని మలుపు చోటుచేసుకుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా రాజకీయంగా దూరంగా ఉన్న అన్నదమ్ములు ఉద్ధవ్ థాకరే, రాజ్ థాకరే మళ్లీ ఒక్కటయ్యారు. ఈ కలయిక మహారాష్ట్ర రాజకీయాల్లోనే కాదు, దేశవ్యాప్తంగా కూడా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా 2026 ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో వీరిద్దరూ కలిసి పనిచేయాలని నిర్ణయించుకోవడం రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ముంబైలోని శివాజీ పార్క్ సమీపంలో ఉన్న శివసేన వ్యవస్థాపకుడు బాలాసాహెబ్ థాకరే స్మారక చిహ్నం వద్ద ఉద్ధవ్ థాకరే, రాజ్ థాకరే కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇద్దరూ ఒకే కారులో రాజ్ థాకరే ఇంటి నుంచి రావడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇది కేవలం ఒక కుటుంబ సమావేశం మాత్రమే కాకుండా, రాబోయే రాజకీయ మార్పులకు సంకేతంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. విభేదాలు, వ్యక్తిగత అపార్థాల కారణంగా విడిపోయిన ఈ కుటుంబం మళ్లీ కలవడం మరాఠీ ఓటర్లలో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ప్రత్యేకంగా ఏక్‌నాథ్ షిండే వర్గంతో తీవ్రంగా పోరాడుతున్న ఉద్ధవ్ థాకరేకు, తమ్ముడు రాజ్ థాకరే మద్దతు లభించడం ఒక పెద్ద ప్లస్ పాయింట్‌గా కనిపిస్తోంది. ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఉద్ధవ్ థాకరే రాజకీయ భవిష్యత్తుకు అత్యంత కీలకంగా మారాయి. ఎందుకంటే ఈ ఎన్నికల్లో గెలుపు సాధిస్తేనే శివసేన అసలైన వారసుడు ఎవరు అన్న విషయం ప్రజల్లో స్పష్టతకు వస్తుంది. మరాఠీ మనుషుల హక్కుల కోసం, ముంబై ఆత్మగౌరవం కోసం తామంతా ఒక్కటయ్యామని ఈ ఇద్దరు నాయకులు ప్రకటించారు. కులమతాలకు అతీతంగా ముంబై ప్రజలందరినీ కలుపుకుని ముందుకు వెళ్తామని శివసేన నాయకులు పేర్కొన్నారు. సీట్ల పంపకాలు కన్నా ముంబై ప్రయోజనాలే తమకు ప్రాధాన్యత అని, నాసిక్ వంటి ఇతర కార్పొరేషన్లలో కూడా ఈ పొత్తు కొనసాగుతుందని వెల్లడించారు. ఈ పొత్తు ద్వారా ముంబై పీఠాన్ని తప్పకుండా దక్కించుకుంటామని రాజ్ థాకరే ధీమా వ్యక్తం చేశారు. అయితే ఈ రాజకీయ పొత్తు ద్వారా నిజంగా లాభం ఎవరికీ? నష్టం ఎవరికీ? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో వినిపిస్తున్నాయి. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ కలయిక వల్ల లాభం నేరుగా ముంబై ప్రజలకు చేరుతుందా? లేక ఈ ఇద్దరు సోదరులకు, వారిని నమ్ముకున్న నాయకులకు మాత్రమే పరిమితమవుతుందా? అన్న సందేహాలు ఉన్నాయి. . దీని ఫలితం ముంబై మున్సిపల్ ఎన్నికలతో పాటు, రాష్ట్ర రాజకీయాల దిశను కూడా నిర్ణయించనుంది. ఈ పొత్తు ద్వారా ఎవరు గెలుస్తారు, ఎవరు నష్టపోతారు అన్నది కాలమే తేల్చాలి. కానీ ఇప్పటికైతే, ఈ కలయిక మహారాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా కొనసాగుతోంది. 2023లో ఎన్సీపీ చీలిక తర్వాత ఉప్పునిప్పులా విడిపోయిన బాబాయ్ అబ్బాయ్ (శరద్ పవార్, అజిత్ పవార్) మళ్లీ చేతులు కలిపారు. రాబోయే పింప్రిచించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కోసం రెండు వర్గాలు కలిసి పోటీ చేస్తాయని ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అధికారికంగా ప్రకటించారు. "రాష్ట్ర అభివృద్ధి కోసం కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. గడియారం, ట్రంపెట్ గుర్తులు ఇప్పుడు ఏకమయ్యాయి. పవార్ కుటుంబం మళ్లీ ఒక్కటైంది" అని ఆయన పేర్కొనడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.పింప్రిచించ్వాడ్ ప్రాంతం దశాబ్దాలుగా పవార్ కుటుంబానికి కంచుకోటగా ఉంది. 1999 నుంచి 2017 వరకు ఇక్కడ పవార్ల హవానే నడిచింది. అయితే 2017లో బీజేపీ ఈ కోటను కైవసం చేసుకుంది. అయితే ఇప్పుడు ఆ పాత వైభవాన్ని తిరిగి తెచ్చుకోవడమే లక్ష్యంగా ఇరు వర్గాలు పొత్తుకు సిద్ధం అయ్యాయి. కేవలం కుటుంబం కలవడమే కాకుండా.. ఓట్లు చీలిపోకుండా చూసి బీజేపీని దెబ్బకొట్టాలనేది వీరి మాస్టర్ ప్లాన్. సీట్ల సర్దుబాటుపై చర్చలు ఇప్పటికే ముగిశాయని.. త్వరలోనే తుది జాబితా విడుదల చేస్తామని అజిత్ పవార్ స్పష్టం చేశారు.ఈ పొత్తుపై మహాయుతి కూటమిలోని ఇతర భాగస్వామ్య పక్షాల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. బీజేపీ నేత నవనీత్ రాణా మాట్లాడుతూ.. "అజిత్ పవార్ ఎప్పుడూ శరద్ పవార్ మాట వింటారని మాకు తెలుసు. ఇప్పుడు వారు కలవడం సంతోషకరం. త్వరలోనే శరద్ పవార్ కూడా ఎన్డీయేలో చేరుతారని ఆశిస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. అయితే ఏక్‌నాథ్ షిండే శివసేన వర్గం మాత్రం దీనిని తీవ్రంగా విమర్శించింది. మహారాష్ట్ర ప్రజలు కేవలం 'ఇంటి పేరు' చూసి ఓట్లు వేయరని.. అభివృద్ధి చేసే వారికే పట్టం కడతారని షైనా ఎన్‌సి వంటి నేతలు ఎద్దేవా చేశారు. ముంబై, పుణెతో పాటు పింప్రిచించ్వాడ్ సహా మొత్తం 29 మున్సిపల్ కార్పొరేషన్లకు 2026 జనవరి 15వ తేదీన పోలింగ్ జరగనుంది. మరుసటి రోజు 16న ఓట్ల లెక్కింపు చేపడతారు. నామినేషన్ల దాఖలుకు డిసెంబర్ 30 చివరి తేదీ కావడంతో.. పవార్ల పొత్తు ప్రకటన అభ్యర్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. పుణె రీజియన్‌లో పట్టు సాధించేందుకు 'పవార్ పరివార్' వేసిన ఈ ఎత్తుగడ ఏ మేరకు ఫలిస్తుందో చూడాలి.

ప్రతిపక్షం

హైదరాబాద్,

గురువారం
01.01.2026

మరచిపోలేని చరిత్ర భీమా కోరెగావ్ యుద్ధం

మానవ సమాజ నాగరికతలో భాగంగా ఆనాటి నుండి నేటి వరకు అనేక భీకర యుద్ధాలు జరిగాయి అవి అన్నీ కూడా సామ్రాజ్యవాద దృక్పథంతో జరిగిన యుద్ధాలే కానీ ఆత్మగౌరవం కోసం కొద్దిపాటి వందల సైన్యం వేలాది సైన్యాన్ని ఎదుర్కొనడం అనేది చరిత్రనే భయపడేలా, చరిత్రలో నమ్మలేని విధంగా, యుద్ధానికి దడ పుట్టే యుద్ధం అంటే ఇంత అద్భుతంగా ఉంటుందా అనే ప్రశ్న..? రాకమానదు..! మరి అలాంటి అసాధారణమైన అద్భుతమైన గొప్ప యుద్ధమే భీమా కోరెగావ్ యుద్ధం.



పుల్లెంల గణేష్
9553041549

నాటి బ్రిటిష్ వలస పాలకులు భారతదేశాన్ని 1757 లో ఆక్రమించుకోవడం ప్రారంభించి 1818 సంవత్సరంలో పూర్తి చేశారని డా. అంబేద్కర్ తెలిపారు. ఈ రెండు సంవత్సరాలకి భారతదేశ చరిత్రలో చాలా ప్రాముఖ్యత ఉన్నది.ఈస్ట్ ఇండియా కంపెనీ 1757 లోనే టిప్పు సుల్తాన్ తో యుద్ధం చేసింది. మానవ మనుగడకి, మానవ నాగరికతకు స్ఫూర్తి "చరిత్ర తెలుసుకోలేని వాడు చరిత్రను తిరిగి నిర్మించ లేడని" డా.అంబేద్కర్ అనేక సందర్భాల్లో అన్నారు. బెంగాల్లో నామ శూద్రులు(మాదిగలు) మద్రాస్ లో పరాయాలు(మాదిగలు) బొంబాయి ప్రెసిడెన్సీలో మహర్లు,చమర్లు ఈస్ట్ ఇండియా కంపెని తరపున యుద్ధం చేసి గెలిచారు. అలా చేసిన చివరి యుద్ధమే 1818 లో మహారాష్ట్రలోని బ్రాహ్మణ పీష్వా రాజ్యానికి వ్యతిరేకంగా ఈస్ట్ ఇండియా కంపెని తరపున చమర్లు(మాదిగలు) వారి సోదరులు మహర్లు చేసిన కోరెగావ్ యుద్ధం. 28000 మంది బ్రాహ్మణ పీష్వా సైన్యంతో కేవలం 500 మంది మహర్లు, చమర్లు అద్భుతమైన యుద్ధం చేసి విజయం సాధించారు. జనవరి 1.1818 తేదీన ఈ యుద్ధం గెలిచారు. అందుకే బాబా సాహెబ్ డాక్టర్. అంబేద్కర్ జనవరి ఒకటవ తారీఖున "శౌర్య దివాస్" గా జరుపుకునే వారు. ప్రపంచవ్యాప్తంగా మానవులు అందరు జనవరి ఒకటవ తారీఖున నూతన సంవత్సర ప్రారంభ రోజుగా పండగల జరుపుకుంటారు. కానీ భారతదేశంలో అంటరాని వారిగా చూడబడిన షెడ్యూల్ కులాలకి చెందిన మరి ముఖ్యంగా చమర్, మహార్ కులస్తులకు జనవరి ఒకటి అంటే గుర్తుకు వచ్చేది నూతన సంవత్సరం కాదు, భీమా కోరెగావ్ యుద్ధానికి విజయంగా చేసుకునే శౌర్య దివాస్ మాత్రమే.పీష్వా రాజ్యం ఎప్పుడు ఉనికిలోకి వచ్చింది..? మహర్లు, చమర్లు యుద్ధం ఎందుకు చేయవలసి వచ్చింది..? బ్రిటిష్ సైన్యంతో కలిసి అస్పృశ్యులైన చమర్లు, మహర్లు యుద్ధం ఎందుకు చేశారు..? ఇలాంటి అనేక ప్రశ్నలకు సమాధానాలు క్లుప్తంగా లభించాలంటే చరిత్రలోకి లోతుగా తొంగి చూడక తప్పదు..! భారత రాజ్యాంగానికి ముందు ఉన్న మనుధర్మ శాస్త్రం ప్రకారం శూద్రులకి ముఖ్యంగా నాలుగు హక్కులు లేవు అవి ఆస్తి హక్కు, ఆయుధం పట్టే హక్కు, చదువుకునే హక్కు, రాజ్య పాలన చేసే హక్కులు శూద్రులకి నిరాకరించబడ్డాయి. ఈ నాలుగు హక్కులు అణగారిన ప్రజలకి, స్త్రీలకు కూడా లేవు.ఈ నాలుగు హక్కులపై బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులాలకు మాత్రమే మనుధర్మ శాస్త్రం హక్కులను ఇచ్చింది. కాబట్టి మనుధర్మ శాస్త్రాన్ని ఈ దేశ మూలవాసులైన, ఈ దేశ నిర్మాతలైన 90% బీసీ ఎస్సి ఎస్టీ లు మొదటి నుండి నిరంతరం వ్యతిరేకిస్తూనే ఉన్నారు. పూణేలోని పీష్వా బ్రాహ్మణులు ఛత్రపతి శివాజీ మహారాజ్ శూద్రుడు కాబట్టి రాజుగా అంగీకరించమని చెప్పారు. విశాలమైన భారత్ లో భాగమైన పీష్వా రాజ్యాన్ని ఆక్రమించుకోకుండా బ్రిటిష్ సామ్రాజ్యం నిర్మాణం పూర్తి కాదు. కాబట్టి 1817 డిసెంబర్ చివరి వారంలో ఈస్ట్ ఇండియా కంపెని సైన్యం పూనా పట్టణానికి పాతిక మైళ్ల దూరంలో ఉన్న కోరెగావ్ అనే గ్రామానికి చేరుకొని ఆ ఊరి గుండా పారే భీమా నది తీరంలో వారు గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈస్ట్ ఇండియా కంపెని సైన్యం కేవలం 200 మంది మాత్రమే



ఉన్నారు. పీష్వా సైన్యం 25 వేల మంది కాల్బలం, 5000 మంది అశ్విక, గజబలం కలిగి ఉన్నారు. బ్రిటిష్ సైన్యంతో పోల్చుకుంటే ఎక్కువ మోతాదులో ఉన్న పీష్వా సైన్యంతో ఎలా యుద్ధం చేసి పీష్వా రాజ్యాన్ని అస్తగతం చేసుకోవాలని ఈస్ట్ ఇండియా కంపెని ఆలోచనలు చేస్తున్నారు. అదే సమయంలో ఊరి చివరన అంటరాని వారిగా జీవిస్తున్న చమర్లు, మహర్లు బ్రిటిష్ సైన్యాన్ని కలిసి ఎలాగైనా సరే పీష్వా రాజ్యాన్ని కూల్చివేయమని కోరారు.సరిపడా సైన్యం లేకపోవడం వల్ల ఎలా పీష్వా సైన్యంతో యుద్ధం చేసి గెలవాలో అయోమయంలో పడ్డామని కంపెని అధికారులు తెలిపారు. బ్రిటిష్ సైన్యం అనుమతిస్తే వారితో కలిసి యుద్ధం చేసి పీష్వా సైన్యాన్ని ఓడిస్తామని 500 మంది చమర్, మహార్ వీరులు కోరారు. లార్డ్ రాబర్ట్ క్లైమ్ 200 మంది పరాయా సైన్యంతో ప్లాసీ యుద్ధంలో టిప్పు సుల్తాన్ ను బ్రిటిష్ సైన్యం ఓడించింది. కాబట్టి చమర్, మహార్ వీరుల యుద్ధ నైపుణ్యాలు వారి పౌరుషం స్వయంగా చూశారు. మీకు నిజంగా పీష్వా రాజ్యాన్ని కూల్చివేయాలని ఉంటే యుద్ధం చేయమని చమర్,మహార్ వీరులకి బ్రిటిష్ సైన్యం అనుమతించింది. కానీ కంపెని సైన్యం యుద్ధంలో పాల్గొన్నదని విలువైన ఆయుధాలు చమర్, మహార్ సైనికులకి ఇవ్వమని నిబంధన పెట్టారు. ఒకవేళ యుద్ధం గెలిస్తే చమర్, మహార్ వీరులని సైనికులుగా గుర్తించి పౌర హక్కులు, మానవాక్కులు కల్పిస్తామనే హామీ ఇచ్చారు. కంపెని ఇచ్చే సౌకర్యాల కన్న పీష్వా మనుధర్మ పాలనని అంతం చేయాలన్న కసి వాళ్లలో ఎక్కువగా ఉంది. ఎందుకంటే మనుధర్మ శాస్త్ర ఆధారంగా బ్రాహ్మణ పీష్వా పాలన మూలంగా చమర్,మహర్లు సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా సాంస్కృతికంగా అనగదొక్కబడి ఎలాంటి మానవ హక్కులు లేకుండా అంటరాని వారిగా జీవిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎలాంటి అత్యాధునిక ఆయుధాలు లేకుండానే భీమా నది తీరంలో 500 మంది ఐన చమర్,మహార్, మాంగ్,మాతంగి వీరులు యుద్ధ రంగంలోకి దిగి 30 వేల మంది బ్రాహ్మణ పీష్వా సైన్యంతో వీరోచిత పోరాటం చేశారు. సైన్యం తక్కువ ఉన్న చమర్, మహర్ల యుద్ధ వ్యూహాలు,యుద్ధ నైపుణ్యాలు,వారి పరాక్రమం ముందు పీష్వా సైన్యం ఓటమి పాలయ్యారు. చావు భయంతో భీమా నదిలోకి దూకిపోతున్న పీష్వా సైన్యాన్ని చమర్, మహార్ సైనికులు వదిలిపెట్టలేదు. భీమా నదిలో నీళ్లకు బదులుగా రక్తం ఏరులై పారింది. జనవరి 1 న చివరి బాజీరావు పీష్వా రాజ్యం వదిలేసి పారిపోయాడు. జనవరి 1.1818 న మనువాద రాజ్యాన్ని అంటరాని వారిగా పేరొందిన చమర్,మహార్ సైనికులు కూల్చివేశారు. అయితే బ్రిటిష్ వాళ్ళ తరుపున చవర్, మహార్ వీరులు యుద్ధం చేయడానికి కంటే ముందుగా బ్రాహ్మణ పీష్వా సైన్యంతో కలిసి బ్రిటిష్ సైన్యాన్ని మేము ఓడిస్తాము, అందుకు పీష్వా సైన్యంలో చమర్, మహార్ సైనికులని కలుపుకోవాలని అడగగా మీరు అంటరానివారు అంటూ అవమానించి మీరు ఖడ్గం పట్టుకునే హక్కు లేదు మనిషిగా కూడా గుర్తింపు లేని మీరు మాతో కలిసి సమాన హోదా ఎలా అనుభవిస్తారని చమర్, మహార్ వీరుల అభ్యర్థనను తిరస్కరించడం జరిగింది. ఇలా బ్రాహ్మణ పీష్వా సైన్యంతో అవమానాలను ఎదుర్కొని అందుకు బ్రిటిష్ సైన్యంతో చమర్,మహార్ సైన్యం కలిసి బ్రాహ్మణ పీష్వా సైన్యంపై పోరాడి తమ ఆత్మ గౌరవాన్ని చాటి చెప్పుకోవాల్సిన పరిస్థితి నాడు నెలకొన్నది. ఇది అనాటి నుండి నేటి వరకు మానవ చరిత్రలోనే అత్యద్భుతమైనది, నమ్మశక్యం కానిది, ఆత్మగౌరవం కోసం, మానవ హక్కుల కోసం, మనిషిగా గుర్తింపు కోసం చేసిన యుద్ధం. సువర్ణ అక్షరాలతో అక్షరాలతో రాయదగిన సంఘటన భీమా కోరెగావ్ యుద్ధం. అందుకే యుద్ధంలో అమరులైన వారు చేసిన అసాధారణమైన వీరోచితమైన పోరాటానికి గుర్తుగా వారి విజయానికి చిహ్నంగా తరతరాలకు వారి స్ఫూర్తి తెలిసే విధంగా బ్రిటిష్ పాలకులు కోరెగావ్ గ్రామంలో "క్రాంతి స్తంభం" అనే స్థూపం ఏర్పాటు చేశారు.ఆ స్థూపం మీద యుద్ధంలో మరణించిన చమర్, మహార్ వీరుల పేర్లు శిలాక్షరాలుగా లిఖించారు. యుద్ధం తదనంతరం ఈస్ట్ ఇండియా కంపెని మహార్ రిజిమెంటు, చమర్ రిజిమెంటు అనే రెండు సైనిక పటాలను ఏర్పాటు చేశారు. సైన్యంలో పని చేసిన వాళ్లకు భూములు ఇచ్చారు. చట్టబద్ధంగా వచ్చే అన్ని సౌకర్యాలు కల్పించారు, వారి కుటుంబల కోసం విద్యాసంస్థలు ఏర్పాటు చేశారు. అయితే ప్రతి ఏటా మహాత్మా జ్యోతిరావు పూలే భీమా కోరెగావ్ క్రాంతి స్తంభం దగ్గర సమావేశాలు నిర్వహించేవారు. అంతేకాకుండా పూలే గారు శివాజీ మహారాజ్, జిజియా బాయి ల సమాధులను గుర్తించి వాటిని ప్రేరణ స్థలాలుగా మార్చాడు. భీమా కోరెగావ్ యుద్ధంలో అమరులైన చమర్, మహార్ వీరుల స్ఫూర్తితో మనువాదం ఏ రూపంలో ఉన్న కూల్చివేయాలని పిలుపునిస్తూ ప్రతి ఏటా కోరెగావ్ గ్రామంలోని క్రాంతి స్తంభాన్ని సందర్శించి శౌర్య దివాస్ గా జరుపుకోవాలని డా. అంబేద్కర్ చెప్పేవారు.

(వ్యాసకర్త ధర్మ సమాజ్ పార్టీ స్టడీ & రీసెర్చ్ టీం రాష్ట్ర ఇంచార్జ్)

దైవకణాల పరిశోధకుడు సత్యేంద్రనాథ్ బోస్



సుధాకర్.ఏ.వి
9000674747

అతను స్వయం బోధకుడు, బహుభాషా కోవిదుడు. అతను భౌతిక శాస్త్రం,రసాయన శాస్త్రం, గణిత శాస్త్రం, జీవ శాస్త్రం, లోహ సంగ్రహణ శాస్త్రం, తత్వ శాస్త్రం, కళలు,సాహిత్యం,సంగీతం వంటి అనేక రంగాలలో కృషిచేశాడు. అతను స్వతంత్ర భారత దేశంలో అనేక పరిశోధనా కమిటీలలో పనిచేసి విశేష సేవలనందించాడు. అతను ఎవరో కాదు సత్యేంద్రనాథ్ బోస్. బోస్ భారత దేశం లోని పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ముఖ్య పట్టణమైన కలకత్తాలో జన్మించాడు. అతని తండ్రి సురేంద్రనాథ్ బోస్ ఒక రైల్వే ఉద్యోగి. సురేంద్రనాథ్ బోస్ కు మొదటి సంతానంగా సతేంద్రనాథ్ బోస్ జన్మించాడు. అతని పూర్వీకులు కలకత్తాకు 48 కిలోమీటర్ల దూరంలో ఉన్న నదియా జిల్లాలోని బారా జగులియాలో ఉండేవారు. అతను తన ఐదవ యేట విద్యాభ్యాసం ప్రారంభించాడు. అతను చదివే పాఠశాల తన యింటికి దగ్గరలో ఉండేది. తర్వాత అతని కుటుంబం గోవాబహన్కు మారినది. అచ్చట న్యూ ఇండియన్ పాఠశాలలో చేరాడు. తన పాఠశాల చివరి సంవత్సరంలో అతను "హిందూ పాఠశాల"కు మారాడు. 1909 లో జరిగిన మెట్రిక్యులేషన్ ప్రవేశ పరీక్షలో అత్యధిక మార్కులు పొంది ఉత్తీర్ణుడయ్యాడు. తర్వాత విజ్ఞాన శాస్త్రంలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించడానికి కలకత్తాలో గల ప్రెసిడెన్సీ కళాశాలలో చేరాడు. అచట కీర్తి ప్రతిష్ఠలు పొందిన ఉపాధ్యాయులైన జగదీశ్ చంద్రబోస్, ప్రఫుల్ల చంద్రరాయ్ లు అతని గురువులు. ఎం.యస్సీ పూర్తి చేసిన తర్వాత 1916 లో కలకత్తా విశ్వవిద్యాలయంలో పరిశోధకునిగా చేరాడు. అచట అతను సాపేక్ష సిద్ధాంతం పై తన పరిశోధనలు ప్రారంభించాడు. ఇది విజ్ఞాన శాస్త్ర అభివృద్ధి చరిత్రలో ఒక విశేషమైన యుగంగా చెప్పుకోవచ్చు.ఆదే సమయంలో ఐన్‌స్టీన్ ప్రతిపాదించిన సాపేక్ష సిద్ధాంతం వెలువడింది. దాని ముఖ్య ఫలితాలు వెలువడినవి. సత్యేంద్రనాథ్ బోస్ తన 20 వ సంవత్సరంలో "ఉషావతి"ని వివాహం చేసుకున్నాడు. వారికి తొమ్మిది మంది పిల్లలు జన్మించారు. వారిలో ఇద్దరు బాల్య దశలోనే మరణించారు. అతను 1974లో మరణించే నాటికి తన వద్ద భార్య,ఇద్దరు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. అతను బహుభాషా కోవిదుడు. అతను బెంగాలీ, ఆంగ్లం, ఫ్రెంచ్, జర్మన్, సంస్కృతం భాషలందు, టెన్నిసన్, రవీంద్రనాథ టాగూరు, కాళిదాసు కవిత్వాల యందు నిష్ణాతుడు. అతను వయొలిన్ వంటి వాద్య పరికరం అయిన ఎస్రాజ్ కూడా వాయించేవాడు. ఎక్స్‌రే వర్ణపట శాస్త్రం, ఎక్స్‌రే వివర్తనం, పదార్థ అయస్కాంత లక్షణాలు,



దృశా వర్ణపటశాస్త్రం, నిస్తంత్రీ విధానం, ఏకీకృత క్షేత్ర సిద్ధాంతాలలో పరిశోధనా కేంద్రంగా మార్చడానికి అతను ప్రయోగశాలలు, గ్రంథాలయాలను ఏర్పాటు చేశాడు. అతను మేఘనాథ్ సాహాతో కలసి ఆదర్శ వాయువులకు సమీకరణాన్ని ప్రచురించాడు. అతను 1945 వరకు ఢాకా విశ్వవిద్యాలయంలో సైన్స్ ఫ్యాకల్టీ డీన్ గా కూడా తన సేవలనందించాడు. భారతదేశ విభజన ఆసన్నమైనప్పుడు, అతను ప్రతిష్ఠాత్మక ఖైరా చైర్ చేపట్టడానికి కలకత్తాకు తిరిగి వచ్చి కలకత్తా విశ్వవిద్యాలయంలో 1956 వరకు బోధించాడు. ప్రతి విద్యార్థి స్థానిక సామగ్రిని, స్థానిక సాంకేతిక నిపుణులను ఉపయోగించి తన సొంత పరికరాలను రూపొందించాలని పట్టుబట్టాడు. తన పదవీవిరమణ నాటికి గౌరవాచార్యుడయ్యాడు. శాంతినికేతన్ లోని విశ్వభారతి విశ్వవిద్యాలయానికి ఉప కులపతిగా తన సేవలనందించాడు. అణు భౌతిక శాస్త్రంలో పరిశోధనలు కొనసాగించడానికి, సేంద్రీయ రసాయనశాస్త్రంలో మునుపటి పనులను పూర్తి చేయడానికి కలకత్తా విశ్వవిద్యాలయానికి తిరిగి వచ్చాడు. తరువాతి సంవత్సరాల్లో, అతను బక్రేశ్వర్ వద్ద వేడి నీటి బుగ్గలలో హీలియం వెలికితీత వంటి అనువర్తిత పరిశోధనలలో పనిచేశాడు. రేడియేషన్ సిద్ధాంతం, అతినీలలోహిత విపత్తుపై ఢాకా విశ్వవిద్యాలయంలో ఉపన్యాసం చేస్తున్నప్పుడు, బోస్ తన విద్యార్థులకు సమకాలీన సిద్ధాంతం సరిపోదని చూపించడానికి ఉద్దేశించాడు. ఎందుకంటే ఇది ప్రయోగాత్మక ఫలితాలకు అనుగుణంగా ఫలితాలను అంచనా వేయలేకపోయింది. ఈ వ్యత్యాసాన్ని వివరించే ప్రక్రియలో, బోస్ మొదటిసారి "మాక్స్‌వెల్‌బోల్ట్‌జ్‌మన్ పంపిణీ" సూక్ష్మ కణాల విషయంలో నిజం కాదని, హైసెన్‌బర్గ్ అనిశ్చితత్వ సూత్రం కారణంగా హెచ్చుతగ్గులు గణనీయంగా ఉంటాయని తెలిపాడు. ప్రతి స్థితి హెచ్3 ఘనపరిమాణాన్ని కలిగి ఉండి, కణాల ప్రత్యేకమైన స్థానం, వేగాన్ని విస్మరిస్తుంది. అందువల్ల అతను దశాంతరాళంలో కణాలను కనుగొనే సంభావ్యతను నొక్కిచెప్పాడు, బోస్ ఈ ఉపన్యాసాన్ని "ప్లాంక్స్ లా అండ్ హైపోథెసిస్ ఆఫ్ లైట్ క్వాంటా" అనే చిన్న వ్యాసంలో స్వీకరించాడు. దానిని కింది లేఖతో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌కు పంపాడు. 1937 లో, రవీంద్రనాథ్ ఠాగూర్ తన ఏకైక విజ్ఞాన శాస్త్రం, "విశ్వపరిచయ్"ను సత్యేంద్ర నాథ్ బోస్ కు అంకితం చేశాడు. బోస్‌ను 1954లో భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ టైటిల్ తో సత్కరించింది. 1959 లో, అతను నేషనల్ ప్రొఫెసర్‌గా నియమితుడయ్యాడు. ఇది ఒక పండితుడికి దేశంలో ఇచ్చిన అత్యున్నత గౌరవం, ఈ పదవిని 15 సంవత్సరాలు కొనసాగించాడు. 1986 లో "ఎస్.ఎన్. బోస్ నేషనల్ సెంటర్ ఫర్ బేసిక్ సైన్సెస్" కలకత్తాలోని సాల్ట్ లేక్‌లో భారత ప్రభుత్వ పార్లమెంటు చట్టం ద్వారా స్థాపించబడింది.బోస్ కొత్తగా ఏర్పడిన కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్‌కు సలహాదారు అయ్యాడు. అతను ఇండియన్ ఫిజికల్ సొసైటీ, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అధ్యక్షుడిగా పనిచేశాడు.ఈయన ఫిబ్రవరి 4 1984 న మరణించాడు.

(నేడు సత్యేంద్రనాథ్ బోస్ జయంతి)
(వ్యాసకర్త ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు)

రోడ్డు భద్రతపై నిర్లక్ష్యం.. తీరని నష్టం



మలిపెద్ది పవన్ కళ్యాణ్
7093052815

ఆధునిక జీవన విధానంలో బైక్ ప్రయాణం అనేది ఒక అవసరంగా మారిపోయింది. పని కోసం, చదువు కోసం, వ్యాపార అవసరాల కోసం రోజూ వేల కిలోమీటర్లు బైక్‌పైనే ప్రయాణం జరుగుతోంది. అయితే అంత అవసరమైన ఈ ప్రయాణంలో భద్రతకు సంబంధించిన అంశాలను మాత్రం చాలా మంది పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. ముఖ్యంగా హెల్మెట్ ధరించడంలో కనిపిస్తున్న అశ్రద్ధ నేడు అనేక కుటుంబాలను విషాదంలోకి నెట్టేస్తోంది.

కొంచెం దూరమే కదా అనే ఆలోచనే ప్రాణాంతకం

ఇంటికి దగ్గరే కదా, హెల్మెట్ వేసుకుంటే ఇబ్బందిగా ఉంది ఇంతకు ముందు కూడా ఏమీ కాలేదు అనే తేలికపాటి ఆలోచనలు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. ప్రమాదం అనేది ముందుగా చెప్పి రాదు. ఒక్క క్షణం నియంత్రణ కోల్పోయినప్పుడే ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ముఖ్యంగా హెల్మెట్ లేకుండా బైక్ నడిపినప్పుడు తలకు తగిలే చిన్న గాయం కూడా ప్రాణాంతకంగా మారుతోంది. రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో ఎక్కువ మంది తల గాయాల వల్లే ప్రాణాలు కోల్పోతున్నారు అన్నది చేదు నిజం. ఈ నిజాన్ని అంగీకరించకుండా “నాకు ఏమీ కాదు” అనే అహంకార ధోరణి ఎన్నో కుటుంబాలను శాశ్వత విషాదంలోకి నెట్టేస్తోంది.

మద్యం సేవించి వాహనం నడపడం స్వయం హత్యతో సమానం

ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదాలకు మరో ప్రధాన కారణంగా మారింది మద్యం సేవించి వాహనాలు నడపడం. మద్యం సేవించిన వ్యక్తికి నిర్ణయశక్తి తగ్గిపోతుంది, వేగంపై నియంత్రణ కోల్పోతాడు, ఎదురుగా వస్తున్న వాహనాలు, పాదచారులు కూడా కనిపించని స్థితికి చేరుకుంటాడు. “కొంచెం తాగితే ఏమీ కాదు” అనే నిర్లక్ష్య భావన క్షణాల్లోనే ఘోర ప్రమాదంగా మారుతుంది. మద్యం తాగి బైక్ లేదా కారు నడిపే వ్యక్తి తన ప్రాణాలనే కాదు, రోడ్డుపై అమాయకంగా నడిచే ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టేస్తున్నాడు. ఒక్క తప్పు నిర్ణయం వల్ల ఎన్నో కుటుంబాలు కన్నీళ్లలో మునిగిపోతున్నాయి. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే జరిగే నష్టం అపారమైనది. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం నేడు సాధారణంగా మారిపోయింది. వేగ పరిమితులు లెక్కచేయకపోవడం, సిగ్నల్స్ దాటేయడం, వన్‌వే రోడ్లలో తప్పుగా వెళ్లడం, మొబైల్ ఫోన్ మాట్లాడుకుంటూ వాహనం నడపడం వంటి నిర్లక్ష్యాలు ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్నాయి. ఈ తప్పులు కేవలం జరిమానాలతోనే ముగియవు. కొన్ని సందర్భాల్లో శాశ్వత వికలాంగత్వం, మరికొన్ని సందర్భాల్లో ప్రాణనష్టం కూడా సంభవిస్తోంది. ఒక క్షణం ఆలస్యం అయినా సరే రూల్స్ పాటించాలి అనే ఆలోచన లేకపోవడం అనేక జీవితాలను నాశనం చేస్తోంది.

చట్టం భయంతో కాదు..
జీవితం విలువ తెలుసుకుని మారాలి

పోలీసు శాఖ ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా, ఎన్ని తనిఖీలు చేస్తున్నా ప్రజల్లో ఆశించిన స్థాయిలో మార్పు రావడం లేదు. జరిమానాలు విధిస్తే కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కానీ హెల్మెట్ చట్టం, మద్యం సేవించి వాహనాలు నడపకూడదు అనే నిబంధనలు, ట్రాఫిక్ రూల్స్ ఇవి ప్రజలను ఇబ్బంది పెట్టడానికి కాదు, ప్రాణాలను కాపాడటానికే. హెల్మెట్ అనేది పోలీసులను తప్పించుకునే సాధనం కాదు; అది మన తలకే కాదు, మన కుటుంబ భవిష్యత్తుకు రక్షణ కవచం. ట్రాఫిక్ నిబంధనలు శిక్షల కోసం కాదు, మన భద్రత కోసం. “నా ప్రాణాల విలువ నాకు తెలుసు” అనే భావన ప్రతి ఒక్కరిలో కలగాలి.శ్రద్ధ లోపమా..? ప్రాణం పై నిర్లక్షమా..? అనే ఈ ప్రశ్నకు సమాధానం మన చేతుల్లోనే ఉంది. ఒక చిన్న జాగ్రత్త.. ఒక హెల్మెట్.. మద్యం వద్దు.. ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం.. ఇవి పాటిస్తే ఎన్నో ప్రాణాలకు, ఎన్నో కుటుంబాలకు భద్రతగా నిలుస్తాయి అని ప్రతి ఒక్కరూ గ్రహించాలి.

(వ్యాసకర్త జర్నలిస్ట్, సామాజిక విశ్లేషకులు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ ‘ఓపెన్ వాయిస్’కు, సాహిత్య పేజీ ‘బహుళ’కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
90102 23917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

కరీంనగర్ కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగరేస్తాం

- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 31: రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తోపాటు తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మున్సిపాలిటీల్లో కాషాయ జెండా ఎగరేయడమే బీజేపీ ముందున్న లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈసారి కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుని తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. టిక్కెట్ల విషయంలో పైరవీలు, మొహమాటాలకు తావులేదని, సర్వే రిపోర్టుల ఆధారంగా గెలుపు గుర్రాలకే పార్టీ నాయకత్వం బీజేపీ టిక్కెట్లు కేటాయిస్తుందని స్పష్టం చేశారు. టిక్కెట్ల కోసం తనతోపాటు తన కుటుంబ సభ్యులకు ఫోన్లు కూడా చేయొద్దని, ఎవరైనా ఒత్తిడి తెస్తే వాళ్లకు వచ్చే టిక్కెట్లు కూడా రావని హెచ్చరించారు. టిక్కెట్ ఆశించడంలో తప్పు లేదని, గెలవలేని పరిస్థితి ఉన్నప్పుడు అర్ధం చేసుకుని పార్టీ గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. టిక్కెట్లు రాకపోయినా పార్టీ పరంగా, నామినేటెడ్ పోస్టుల పరంగా వారికి న్యాయం చేస్తామన్నారు. ఈసారి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎక్కువ మంది నామినేటెడ్ పోస్టులు దక్కేలా క్రుషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల సందర్భంగా టిక్కెట్ల కోసం, ఇతరత్రా విషయాల్లో గొడవలకు దిగే నాయకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని, వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులను కోరారు. టిక్కెట్లు రాలేదనే కోపంతో పార్టీని వదిలివెళ్లాలనుకునే వారి రాజకీయ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈసారి తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, రాజకీయ భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకోవద్దని సూచించారు. తనకు పార్టీ గెలుపు, పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని, ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. బ్లాక్ మెయిల్ కు బెదిరింపులకు బండి సంజయ్ లొంగే రకం కాదని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈరోజు కరీంనగర్ లోని త్రిధా హోటల్ లో కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు హుజూరాబాద్, హుస్నాబాద్, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీల్లోని పట్టణ, జోన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో 'మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం' నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్, డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, వాసాల రమేశ్, రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు.

బెంగాల్ తరువాత తెలంగాణే లక్ష్యం

బెంగాల్, తమిళనాడు ఎన్నికల తరువాత బీజేపీ జాతీయ నాయకత్వం ద్రుష్టి మొత్తం తెలంగాణపైనే సారించబోతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. ఈసారి తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో బీజేపీ గెలుపుతో ''కాంగ్రెస్ ముక్త భారత్'' లక్ష్యాన్ని సంపూర్ణం చేస్తామని చెప్పారు. ఈరోజు కరీంనగర్ లో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో బీజేపీ నాయకులను ఉద్దేశించి బండి సంజయ్ మాట్లాడారు. బీజేపీ కార్యకర్తల త్యాగాలు, పోరాటాలతో కమ్యూనిస్టు కంచుకోట కేరళ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయ ఢంకా మోగించిందన్నారు. బెంగాల్ లో బీజేపీ కార్యకర్తల ఇండ్లను ధ్వంసం చేస్తున్నా, మహిళా మోర్చా కార్యకర్తలపై అత్యాచారం చేసినా వెనకంజ వేయకుండా బెంగాల్ ప్రభుత్వంపై పోరాటాలు చేస్తూ వెన్నులో వణుకు పుట్టిస్తున్నారని చెప్పారు. హైకమాండ్ ద్రుష్టి అంతా త్వరలోనే తెలంగాణలో కేంద్రీక్రుతం చేయబోతోందని, బీజేపీ అధికారంలోకి రావడాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు.



ఓటర్ల జాబితా పొరపాట్లు లేకుండా చూడాలి

- మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 31: ఓటర్ల జాబితా టీ పోల్ ఈ మ్యాపింగ్ ఎలాంటి లోటు పాట్లు జరగకుండా అధికారులు సిబ్బంది జాగ్రత్తలు పాటించాలని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో 66 డివిజన్ల ఓటర్ జాబితా కు సంబంధించిన ఆన్ లైన్ ఈ మ్యాపింగ్ ప్రక్రియను తనిఖీ చేసి పరిశీలించారు. ఈ పోర్టల్ లో ఓటర్ల డేటాను పొందుపరుస్తున్న విధానాన్ని స్వయంగా పరిశీలించి... అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్ సిబ్బంది కి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ.... ముసాయిదా ఓటర్ల జాబిజా తయారీలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ఇచ్చిన డేటాలో డివిజన్ల వారిగా పోలింగ్ బూత్ ప్రకారం ఓటర్ల డాటాను పొందు పరచాలని... మ్యాపింగ్ సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా సక్రమంగా జాబితాను రూపొందించాలని ఆదేశించారు. ప్రతి ఓటర్ డేటాను ఒకటికి రెండు సార్లు పరిశీలించి... ఈ మ్యాపింగ్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ ఖాధర్ మొహియుద్దీన్, టౌన్ ప్లానింగ్ ఏసీపిలు వేణు, శ్రీధర్, టిపిఎస్ లు తేజస్ ని, సంసంధ్య, టీపిబివో లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



అసెంబ్లీలో కూర్చోవడానికి కేసీఆర్‌కు నామోషీ

- డీసీసీ ప్రెసిడెంట్ మేడిపల్లి సత్యం

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 31: అసెంబ్లీకి రావడానికి, కూర్చోవడానికి కేసీఆర్ నామోషీగా ఫీలవుతున్నాడని కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం అన్నారు. మేడిపల్లి సత్యం బుధవారం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యులు అంజన్ కుమార్ తో పాటు పలువురు నాయకులతో కలిసి డిసిసి కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలను అమలు పరుస్తూ మేము ఎన్నికల హామీలలో భాగంగా ఇచ్చిన ఆరోగ్య అంటీలను 80% వరకు అమలు చేస్తున్నామన్నారు. మహిళలందరికీ ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులకు ఉచిత కరెంటు తోపాటు దేశంలో ఎక్కడా లేనివిధంగా రెండు లక్షల రైతు రుణమాఫీ చేయడం జరిగిందన్నారు.ప్రజలు వారిని అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష పాత్రకే పరిమితం చేయగా, పార్లమెంట్ ఎన్నికల్లో సున్నా స్థానాలతో టిఆర్ఎస్ ప్రతిపక్ష పాత్రకు కూడా పనికిరాదని, ఆ పార్టీ తెలంగాణ రాష్ట్రానికి అవసరం లేదని నిరూపించినా వారి ప్రవర్తనలో మార్పు రావడం లేదన్నారు.ఉత్తర తెలంగాణలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు దేవాలయానికి ముఖ్యమంత్రి హోదాలో రెండుసార్లు వచ్చిన కేసీఆర్ గురించి, నాయకుడు వచ్చాడు గాని నయా పైసా రాలేదు అని మా ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు.విలేఖరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు ఎండి తాజ్, బానోతు శ్రావణ్ నాయక్, కొరివి అరుణ్ కుమార్, పురం రాజేశం, ముత్యం శంకర్ గౌడ్,పత్తి మధుకర్ రెడ్డి, వెన్నం రజిత రెడ్డి, పంజాల కృపాసాగర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, దన్ను సింగ్, రోళ్ల సతీష్, మిరాజ్, మంద మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పటాన్ చెరు కేంద్రంగా ఏసిపి కార్యాలయం ఏర్పాటు చేయండి

- డీజీపీ శివధర్ రెడ్డిని కోరిన పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 31 : ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామికవాడగా పేరు గాంచి శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చెరు నియోజకవర్గంలో నూతనంగా చేపడుతున్న పోలీస్ స్టేషన్ల విభజన ప్రక్రియను ప్రజల అవసరాలకు, అభిప్రాయాలకు అనుగుణంగా చేపట్టాలని కోరుతూ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డిని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఉదయం హైదరాబాదులోని డీజీపీ కార్యాలయంలో డిజిపి శివధర్ రెడ్డితో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలను డిజిపి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా పటాన్ చెరు నియోజకవర్గ కేంద్రంగా పనిచేయాల్సిన ఏసిపి కార్యాలయాన్ని రామచంద్ర పురం పేరుతో రామచంద్ర పురం ను కేంద్రంగా ఏర్పాటు చేశారని దీని మూలంగా స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. పటాన్ చెరు పట్టణంలో జాతీయ రహదారికి అనుకొని ప్రజలందరికీ అనువుగా అధునాతన సౌకర్యాలతో ఇటీవల 40,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో డీఎస్పీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామని.. పనులు సైతం ప్రారంభమయ్యాయని తెలిపారు. నూతన భవనంలో పటాన్ చెరు పేరుతో ఏసిపి కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని కొల్లూరు పోలీస్ స్టేషన్ ను నార్సింగి ఏసిపి కార్యాలయం పరిధిలోకి చేర్చారని రామచంద్రపురం ఏసిపి పరిధిలోని చందానగర్ పోలీస్ స్టేషన్ కి బదులుగా కొల్లూరు పోలీస్ స్టేషన్ ను చేర్చాలని కోరారు. దీని మూలంగా పరిపాలనా పరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన డీజీపీ శివధర్ రెడ్డి.. త్వరలోనే ఇందుకు సంబంధించి సానుకూల నిర్ణయాలు తీసుకోవడంతోపాటు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.



బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

- స్వాగతం పలికిన అదనపు కలెక్టర్లు, అధికారులు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 31 : నిజామాబాద్ జిల్లా కలెక్టర్ గా ఇలా త్రిపాఠి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మధ్యాహ్నం 2.40 గంటల సమయంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్దకు చేరుకున్న జిల్లా కలెక్టర్ ను అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ సాదరంగా స్వాగతం పలికారు. నేరుగా తన చాంబర్ కు చేరుకున్న కలెక్టర్ అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కలెక్టర్ ను పలువురు శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి పరిచయం చేసుకున్నారు. కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, ఉద్యోగ సంఘాల నాయకులు కలెక్టర్ కు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు.



బాలసదనం చిన్నారులతో కలెక్టర్ న్యూ ఇయర్ వేడుకలు

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, డిసెంబర్31 : బుధవారం జిల్లా కేంద్రంలోని బాలసదనంలో నివసిస్తున్న చిన్నారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులతో కలసి సహపంక్తి భోజనం చేసి, వారి సంక్షేమం పట్ల జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. బాలల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. చిన్నారులతో కలిసి భోజనం చేస్తూ, వారితో ఆత్మీయంగా ముచ్చటించిన జిల్లా కలెక్టర్ వారు పెద్దయ్యాక ఏమవుతారో ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల సమాధానాలను ఆనందంగా స్వీకరించి, వారి కలలు నెరవేరేలా కృషి చేయాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా 134.9 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న బాలసదనం భవన నిర్మాణాన్ని పరిశీలించి అన్ని హంగులతో మార్చి లోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ట్రైనీ రవితేజ, డీడబ్ల్యూవో ప్రమీల, జిల్లా బాలల పరిరక్షణ అధికారి స్రవంతి, సంబంధిత అధికారులు, బాలసదనం సిబ్బంది పాల్గొన్నారు.



జగ్గారెడ్డి స్వగృహం లో సత్యనారాయణ స్వామి కథ, అయ్యప్ప మహా పడి పూజ

- పెద్ద ఎత్తున పాల్గొన్న అయ్యప్ప స్వాములు, భక్తులు, నాయకులు, కార్యకర్తలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 31 : సంగారెడ్డి పట్టణం లోని రామ్ నగర్ రామ్ మందిర్ వద్ద జగ్గారెడ్డి స్వగృహం లో సత్యనారాయణ కథ, అయ్యప్ప మహా పడి పూజ ఘనంగా జరిగాయి. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రతీ ఏటా డిసెంబర్ 31 న ఆనవాయితీగా ఈ పూజలను జగ్గారెడ్డి నిర్వహిస్తుంటారు. ప్రతీఏడు మాదిరిగానే ఈ సారి సైతం ఈ పూజలు కన్నుల పండుగ గా జరిగాయి. ఉదయం 10 గంటలకు సత్యనారాయణ స్వామి కథ తో ప్రారంభమయ్యే ఈ పూజ కార్యక్రమాల్లో మధ్యాహ్నము అయ్యప్ప పూజ, సాయంత్రం మొదలుకుని అర్ధరాత్రి వరకు మహా పడి పూజా కార్యక్రమాలు ఉంటాయి. ఈసారి ప్రత్యేకంగా మధ్యాహ్నము యోగిని పుష్పార్చన, రుద్రాభిషేకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ భజన బృందాల చే ఏర్పాటు చేసిన భజనలు భక్తులను అలరించాయి. ఈ పూజా కార్యక్రమాల్లో జగ్గారెడ్డి కుమార్తె, అల్లుడు జయా గుణ లతో పాటు కుమారుడు దత్తు, జగ్గారెడ్డి, నిర్మల పాల్గొన్నారు.



జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 31 : జిల్లా ప్రజలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాటిపల్లి నగేష్ రెడ్డి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం నింపాలని రైతులకు తమ పంటపొలాల్లో అధిక దిగుబడులు రావాలని, వ్యాపారులకు తమ వ్యాపారాల్లో అధిక లాభాలు లభించాలని కోరుకుంటూ కొత్త సంవత్సరం శాంతి, సంపద, ఆరోగ్యాన్ని మీకు కలిగిస్తుందని ఆశించారు. జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో సిరిసంపదలతో జీవించాలని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



నిజామాబాద్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 31 : తెలంగాణలోనే నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ను అత్యున్నత స్థానంలో నిలుపుతానని నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు పంచరెడ్డి శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం ప్రెస్ క్లబ్ ఎన్నికలు జరుగగా ఫలితాలు అర్ధరాత్రి వెలువడ్డాయి. బుధవారం ప్రెస్ క్లబ్ లో ఎన్నికలో గెలుపొందిన సభ్యులకు ఎన్నికల అధికారి భాను సర్టిఫికెట్ లు ప్రధానం చేశారు. ఘన విజయం సాధించిన అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి వాగ్మారే సుభాష్, కోశాధికారి రాజ్ కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజు, సహాయ కార్యదర్శిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్క సభ్యుడికి ధన్యవాదాలు తెలియజేశారు. తన విజయానికి కారణమైన సభ్యులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తూ ప్రెస్ క్లబ్ లో ఉన్న సభ్యులందరికీ ఇళ్లస్థలాల విషయం గాని వాళ్లకు లభించే ప్రభుత్వ సదుపాయాలను కానీ ఆరోగ్య విషయంలో కానీ తాను ముందుండి అందరికీ సహకరిస్తానని, తనకు ప్రెస్ క్లబ్ లో ఉన్న ప్రతి ఒక్క సభ్యుడు సమానమేనని అన్నారు. సభ్యులకు సౌకర్యాలు కల్పించడంలో తెలంగాణతో పోటీ పడుతూ నెంబర్ వన్ ప్రెస్ క్లబ్ గా చేస్తానన్నారు. ప్రెస్ క్లబ్ ఎన్నికలలో అత్యధిక 176 ఓట్లతో పంచ రెడ్డి శ్రీకాంత్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా బైసా సంగీత, సతీష్ గౌడ్, జెట్టి గోవిందరాజ్ గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా సుభాష్, కోశాధికారిగా రాజ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ గా బి రాజు, సంయుక్త కార్యదర్శి గా సురేష్, రవీందర్ నాయక్, ఎస్ ఆంజనేయులు గెలుపొందారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా సితారే కృష్ణ, పబ్బ భూమేష్, సరేంద్ర స్వామి, భాస్కర్ గౌడ్, దేశముఖ్ సందీప్, కొత్తూరు సుదర్శన్, రవిచరణ్ రెడ్డి, తాళ్ల శ్రీధర్, ప్రీతం రెడ్డి, అడెపు శ్రీనివాస్, జైపాల్ (సందీప్ గౌడ్, కొక్కు రవికుమార్) లు గెలుపొందారు.



గీతంలో 140 మంది రక్తదానం

- ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో నిర్వహణ



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 31 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ బ్లడ్ సెంటర్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎన్ఎస్ఎస్ అధ్యాపక, విద్యార్థి సమన్వయకర్తలతో కలిసి, గీతం హైదరాబాదు రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ ఈ శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. దాదాపు 140 మంది విద్యార్థి స్వచ్ఛంద సేవకులు ఈ శిబిరంలో ఉత్సాహంగా పాల్గొని, రక్తదానం చేశారు. దాతలకు ఎన్టీఆర్ ట్రస్టు ప్రశంసా పత్రాలను ప్రదానం చేయడంతో పాటు రిఫ్రెష్ మెంట్లను కూడా అందజేసింది. ఇటువంటి నిస్వార్థ చర్యలు ప్రాణాలను కాపాడటమే కాకుండా ఇతరులు ముందుకొచ్చి సమాజ హితానికి దోహదపడేలా ప్రేరేపిస్తాయని నిర్వాహకులు విద్యార్థుల దాతృత్వాన్ని ప్రశంసించారు. రక్తదానం నిజంగా ప్రాణదానం వంటిదని, ఇది వ్యక్తులను, సమాజాన్ని బలోపేతం చేసే ఒక నిస్వార్థమైన చర్యగా వారు అభివర్ణించారు.



అన్ని జిల్లాల్లో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నా అనవసర ఆందోళనలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం సుమారు 2లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయి. సొసైటీ/రిటైల్ షాప్‌కు వచ్చే ప్రతి రైతుకూ బస్తాలు అందుతున్నాయి. యూరియా యాప్ అమలవుతున్న జిల్లాల్లో ఎలాంటి ఇబ్బందుల్లేవు.

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



అందుబాటు సరిపడినన్ని యూరియా బస్తాలు

- జిల్లా కలెక్టర్ కె. హైమావతి

ప్రతిపక్షం, మిరుదొడ్డి, డిసెంబర్ 31: మీరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలోని రైతు వేదికలో యూరియా కార్డుల పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రైతులకు యాసంగి సీజన్ లో ఎక్కడ కూడా యూరియా కొరత రాకుండా పగడ్బంది గా ప్రణాళిక ప్రకారం అన్ని సెంటర్ లలో యూరియా బస్తాలను రైతులకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామన్న తెలిపారు. మీ ప్రాంతాల్లోని వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటారని మీ యొక్క పాసు బుక్ తీసుకుని వచ్చి యూరియా కార్డులను తీసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఒక ఎకరాకు 2 బస్తాల చొప్పున యూరియా పంపిణీ చెయ్యాలని వ్యవసాయ శాఖ అధికారులకు తెలిపారు. కౌలు రైతులు సైతం అధైర్య పడవద్దని మీరు చేస్తున వ్యవసాయ క్షేత్ర పట్టేదర్ పాస్ బుక్ లేదా జిరాక్స్ తీసుకువస్తే యూరియా అందిస్తామని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న యూరియా కొరత కథనాలను నమ్మవద్దని ప్రతి రైతుకు యూరియా అందించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట వ్యవసాయ శాఖ ఏఓ, ఏఈఓ తదితరులు ఉన్నారు.

'సింగూరు' మరమ్మత్తుల దృష్ట్యా నీళ్లు విడుదల చేయలేం

- చెరువుల ధార సాగునీటికి నీరు అందిస్తాం
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 31: సింగూరు డ్యామ్ మరమ్మతుల మూలంగా వన దుర్గ మాత ప్రాజెక్టుకు సాగునీరు అందించలేమని జిల్లాలో 500 ఎకరములకు పై బడి ఆయకట్టు ఉన్న 9 చెరువుల నుంచి పంటలకు సాగునీరు అందించేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజా తెలిపారు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో మీనీ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఇరిగేషన్ అడ్వైజరి బోర్డ్, సాగునీటి శాఖ అధికారుల తో సమావేశంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ రబి 2025 26 సంవత్సరానికి గాను జిల్లాలో గల 500 ఎకరములకు పై బడి ఆయకట్టు ఉన్న 9 చెరువుల నుండి పంటలకు నీరు విడుదలకై చర్చించి నిర్ణయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ తెలిపారు. ఇందుకుగాను తొమ్మిది చెరువులు పెద్ద చెరువు కొముటూరు మెదక్,హైదర్ చెరువు నార్లాపూర్ గ్రామం నిజాంపేట్ మండల్ , రాయరావూ చెరువు నర్సాపూర్, దేవతల చెరువు వెల్దుర్తి , హల్దీ వావ్ ప్రాజెక్టు హకీంపేట్ గ్రామం వెల్దుర్తి మండల్ , పెద్ద చెరువు అంబాజీపేట గ్రామం చిన్న శంకరంపేట మండలం,మసానుపల్లి చెరువు కుసంగి, టేక్మాల్ మండల్,పెద్ద చెరువు చిన్న చెరువు టేక్మాల్ మండల్ ,పెద్ద చెరువు తూప్రాన్ లలోనీ ఆయకట్టు పరిధిలో గల 4,200 ఎకరాలకు సాగు నీరు విడుదల చేయబడుతుందన్నారు. ఈ సందర్భంగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఘన్ పూర్ ఆయకట్ట పరిధిలోని కుల్చారం మండలం రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కు వినతి పత్రం అందించారు.



సింగూరు ప్రాజెక్టు మరమ్మతులను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి, భవిష్యత్తులో సాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నందున ఘనపూర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతులు గమనించి సహకరించాలని కోరారు.

జిల్లా సాగు నీటి సలహా సంఘం సమావేశాన్ని బహిష్కరించిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

సింగూరు డ్యామ్ నుండి రబ్బీ సీజన్ కు సాగు నీటిని విడుదల చేయాలని లేకుంటే క్రాఫ్ హాలిడే ప్రకటించి. ఎకరాకు 25000 వేల రూపాయలు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మ రెడ్డి అన్నారు బుధవారం రోజున మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా సాగు నీటి సలహా సంఘం సమావేశానికి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ సమావేశములో. సింగూరు డ్యామ్ మరమాత్తులు మూలంగా రబీ సిజిన్ కు సాగు నీళ్లు విడుదల చేయలేమని నీటిపారుదల శాఖ అధికారులు చెప్పడంతో. కచ్చితంగా కొల్చారం ఘనాపూర్ మెదక్ మంజీరా పర్యాయక ప్రాంతానికి సంబంధించిన రైతులకు రబ్బీ సీజన్లో సాగునీటిని విడుదల చేయాలని లేకపోతే నష్టపరిహారం వెంటనే ప్రకటించాలని కలెక్టర్ కోరడంతో కలెక్టర్ నీటిపారుదల శాఖ అధికారులు పై అధికారులకు ఈ విషయాన్ని తెలియజేస్తామని చెప్పడంతో ఈ సమావేశంలో రైతులకు నష్టం జరిగే విధంగా ఉండడంతో ఈ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తెలిపారు



ఒక్క ప్రాంతంలోనే ఓటు హక్కు.. అధికారుల బాధ్యత

- జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రతిపక్షం, గజ్వేల్, డిసెంబర్ 31: వంద శాతం ఎలెక్టోరల్ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేసి ఒక్క ప్రాంతంలోనే ఓటు హక్కు కల్పించేలా అధికారుల బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు. బుధవారం నాడు గజ్వేల్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ సంబంధించిన ఎలెక్టోరల్ మ్యాపింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆయా వార్డుల వారిగా బిల్ కలెక్టర్ లు, సూపర్ వైజర్ లు, బిఎల్ఓ లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణకు సంబంధించిన అన్ని పనులను ఫీల్డ్ స్థాయిలో ఇంటింటి తనిఖీలు వేగవంతం చేయాలని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో రెండు ప్రాంతాల్లో ఓటు ఉన్న వారిపైన దృష్టి సారించి ఒక్క ప్రాంతంలోనే ఓటు హక్కు కల్పించేలా వెరిఫై చేసి ప్రతి రోజు చేసిన మ్యాపింగ్ వివరాలు కంప్యూటర్ లో అప్లోడ్ చెయ్యాలని సూచించారు. ఈ మొత్తం ప్రక్రియను యుద్ధ ప్రతిపాదకన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బాలకిషన్ ను ఆదేశించారు. అనంతరం గజ్వేల్ మండలంలోని పిడిచెడు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తూ విద్యార్థులకు సరిపోయేట్టుగా అన్నం కూరలు వడ్డించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. లేదంటే ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



హ్యాపీ న్యూ ఇయర్..

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 31: సిద్దిపేట జిల్లా ప్రజలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కొత్త ఏడాదిలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని, మీ అందరికి మంచి జరగాలని నూతన సంవత్సరం సందర్భంగా ఆకాంక్షించారు. ఈ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి ఇంటా సంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరూ ఆనందకరమైన జీవితం గడపాలని కోరుకుంటున్నాన్నరు.ముఖ్యంగా విద్యార్థులు,యువత నూతన లక్ష్యాలు ఎంచుకొని వాటిని చేరుకునేలా ఒక ప్రణాళికతో ముందుకు సాగాలని హరీష్ రావు కోరారు. మీరు ఏర్పరుచుకున్న లక్ష్యాలను వచ్చే ఏడాది నాటికి చేరుకునేలా శ్రమించాలని కోరుకున్నారు.2025 వ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, 2026లోకి అడుగుపెడుతున్న వేళ అందరికీ శుభం కలగాలని కోరుకుంటూ మరొక్కసారి అందరికీ హ్యాపీ న్యూ ఇయర్ .



జిల్లాలో యూరియా కొరత లేదు

- రైతులు ఆందోళన చెందవద్దు
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజా

ప్రతిపక్ష ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 31: మెదక్ జిల్లాలో యూరియా కోసం రైతులు ఎవరు ఆందోళన చెందని రైతులకు సరిపడే యూరియా ప్రభుత్వం అందించేందుకు సిద్ధంగా ఉందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజా తెలిపారు. మెదక్ జిల్లాలో అన్ని ఫర్టిలైజర్స్ దుకాణాలలో యూరియా అందుబాటులో ఉంచడం జరిగిందని అక్టోబర్ 2025_ జనవరి 26 సంవత్సరానికి మన జిల్లాకు 12,000 మెట్రిక్ టన్నుల యూరియా అవసరముంటుందని రాష్ట్రానికి ప్రతి పాదానాలు పంపాము జరిగిందని ఆయన తెలిపారు. డిసెంబర్ 30 నాటికి మెదక్ జిల్లాకు 12663 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని.8000 మెట్రిక్ టన్నుల యూరియా రైతులు ఇప్పటివరకు కొనుగోలు చేయడం కూడా జరిగిందిని అయినా తెలిపారు.ఇంకా జిల్లాలో 4000 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది. జిల్లాలో మన అవసరానికి మించి యూరియా జనవరి కి కూడా రాబోతుందనీ రైతులు గమనించాలని ఆయన చూపించారు

యూరియా దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

పాపన్నపేట మండలంలోని లక్ష్మీ గ్రోమోర్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కేంద్రంలో నిల్వ ఉన్న ఎరువులు, విత్తనాల స్టాక్ వివరాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఎరువుల నాణ్యత,నిల్వ విధానం, విక్రయ ధరలు ప్రభుత్వం నిర్ణయించిన విధంగా ఉన్నాయా లేదా అన్న అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

మహిళల భద్రతకు షీ–టీమ్స్ చర్యలు

- జిల్లా ఎస్పీ.శ్రీనివాస రావు



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 31: జిల్లాలో మహిళలు, బాలికల భద్రతకు షీ-టీమ్స్ పటిష్టంగా పనిచేస్తున్నాయని జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు తెలిపారు. డిసెంబర్ నెలలో ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన వారిపై 02 ఎఫ్ఐఆర్‌లు, 07 ఈ-పెట్టి కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.రెడ్ హ్యాండ్‌గా తూప్రాన్ సబ్‌డివిజన్‌లో 16 మంది, మెదక్ సబ్ డివిజన్‌లో 48 మంది మొత్తం 64 మందిని పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు, బస్ స్టాప్‌లు, రద్దీ ప్రాంతాల్లో 38 అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎవరైనా మహిళలను లేదా బాలికలను వేధించినా, అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే డయల్-100 లేదా షీ-టీమ్ వాట్సాప్ నంబర్ 8712657963 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు నిండకముందే బాలికల వివాహాలు జరిగితే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. మెదక్ జిల్లాలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ప్రారంభించామని, మనుషుల అక్రమ రవాణా లేదా ఆర్గనైజ్డ్ నేరాలపై సమాచారం అందించాలని తెలిపారు.ఈ షీ-టీమ్స్ తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో షీ-టీమ్ సిబ్బంది. ఎఎస్ఐ వెంకటయ్య, హెడ్ కానిస్టేబుల్ శంకర్, కానిస్టేబుళ్లు ప్రమీల, విజయ్, స్వరూప, గంగామణి, హెచ్‌జీలు విజయ రాణి, సురేష్ కుమార్ తమ తమ డివిజన్లలో విధులు నిర్వహిస్తున్నారు.



వివేకానంద లో న్యూఇయర్ వేడుకలు..

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట డిసెంబర్ 31: సిద్దిపేట పట్టణంలోని భారత్ నగర్ లో గల వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాల లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమములో పాఠశాల ప్రిన్సిపాల్ యాళ్ళ భాస్కర్ రెడ్డి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తలిదండ్రులకు, సిద్దిపేట పరిసర ప్రాంత ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమములో కరస్పాండెంట్ లిఖిత ఉపాధ్యాయులు వాణిశ్రీ,రత్నమాల,దేవిక,కావేరి, భరతమాత, ఫిర్దూజ్,సారిక,మానుష తదితరులు పాల్గొన్నారు.



జెడ్పిటిసి,ఎంపిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

- సిద్దిపేట జిల్లాలో అత్యధిక స్థానాలు మావే
- డీసీసీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి ధీమా

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 31: రాబోయే జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందని సిద్దిపేట జిల్లా డిసిసి అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల లెక్కలు కాదు, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ లెక్కలు పూర్తిగా మారిపోయాయని ఆమె స్పష్టం చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో కేసీఆర్‌ను ఢీకొన్నామని, అదే విధంగా సిద్దిపేట జిల్లాలో బిఆర్ఎస్ నాయకులను ఎదుర్కొని కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తామని తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని ఓబీసీ సెల్ జిల్లా బీసీ సెల్ కార్యాలయంలో ఓబీసీ జిల్లా అధ్యక్షులు సూర్య వర్మ ఆధ్వర్యంలో డిసిసి అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డికి ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంక్ష రెడ్డి మాట్లాడుతూ___కాంగ్రెస్ పార్టీ కోసం నిజాయితీగా పనిచేసిన కార్యకర్తలకు, సీనియర్ నాయకులకు నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు.కాంగ్రెస్ పార్టీలో ఏవైనా గ్రూప్ తగాదాలు ఉన్నట్లయితే వాటిని సమన్వయం చేసి పరిష్కరించేందుకు తాను పూర్తిగా కృషి చేస్తానని ఆంక్ష రెడ్డి పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని, రానున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కే పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షులు సూర్య వర్మ మాట్లాడుతూ___బీసీ వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. ఆంక్ష రెడ్డి నాయకత్వంలో సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జి. శ్రీనివాస్, చంద్రశేఖర్‌తో పాల్గొన్నారు.



ఉపాధి హామీ పథకం పరిరక్షణ కోసం ఉద్యమం

- ఎన్పీఆర్డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 31: ఉపాధి హామీ పథకం పరిరక్షణ కోసం ఉద్యమం చేస్తామని ఎన్.టి.ఆర్.డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య హేచ్చరించారు. బుధవారం ఎన్.టి.ఆర్.డి మెదక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేవల్ కిషన్ భవన్లో కేంద్ర ప్రభుత్వ విధానాలు వికలాంగులపై ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టాలు ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని అన్నారు.వివి జి రామ్ జి బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కేంద్రం తెచ్చిన చట్టం వికలాంగుల జీవనోపాదిని దెబ్బతిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలపై నిధుల భారం పెంచి, కేంద్రం చేతులు దులుపుకోవాలని చూస్తుందని అన్నారు.కార్మిక చట్టలతో పాటు వికలాంగుల చట్టాలను రద్దు చేస్తుందని అన్నారు.వికలాంగుల చట్టాలను అమలు చేయడం లేదని అన్నారు. పెండింగ్ లో ఉన్న చేయూత పెన్షన్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.సహాయ పరికరాల కోసం వేలాది మంది వికలాంగులు దరఖాస్తులు చేసుకుని నెలలు గడుస్తున్నా ఎందుకు పంపిణి చేయడం లేదని అన్నారు.స్థానిక సంస్థల్లో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పిస్తూ అసెంబ్లీ లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు కె మల్లేశం, జిల్లా అధ్యక్షులు ముత్యాలు, వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గ, జిల్లా ఉపాధ్యక్షులు యాదగిరి,కవిత,కె చంద్రం స్వరూప, సహాయ కార్యదర్శులు కిష్టయ్య, శ్రీనివాస్, చంద్రం జిల్లా నాయకులు శ్రీనివాస్, ఓం సాయి, సత్యం, స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





ఓట్లు వేయలేదని వరి నార్లపై మందు పిచికారి

- పంచాయితీ ఎన్నికల చిచ్చు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 31: పచ్చని గ్రామంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు చిచ్చురగిల్చాయి పంచాయతీ ఎన్నికలు 15 రోజులు గడిచిపోయినప్పటికీ ఓటమి చెందిన అభ్యర్థులు జీర్ణించుకోలేకపోతున్నారు. గ్రామాలలో ఓటర్లకు డబ్బులు ఆశ చూపిన వారు ఓట్లు పడకపోవడంతో లబోదిబోమంటున్నారు ఓటర్ల మీద ఉన్న కోపంతో పచ్చని వరి నార్లపై గడ్డి మందులు చల్లి వారిని నష్టపరుస్తున్నావైనం మెదక్ జిల్లాలో చోటు చేసుకుంది హవేలీ ఘన్పూర్ మండలం పోచమ్మరల్ గ్రామంలో రూప్ సింగ్ అనే వ్యక్తి సర్పంచిగా పోటీ చేశాడు గ్రామంలో ఉన్న కురుమ కుల సంఘానికి తనకు ఓటు వేయాలని రెండున్నర లక్షల రూపాయలు ఇవ్వడం జరిగింది.ఎన్నికల అనంతరం ఓటమి చెందిన రూప్ సింగ్ కురుమ కుల సంఘం తరపున తనకు ఓటు వేయలేదని దయచేసి తమ డబ్బులు తనకు చెల్లించాలని కుల సంఘానికి తెలియజేశాడు కురుమ సంఘం తరఫున అందరం ఓటు వేయడం జరిగిందని గుడి మీద ప్రమాణం చేసి గుడి వద్దకు వచ్చి డబ్బులు తీసుకోవాలని రూప్ సింగ్ కు సూచించారు. దీంతో కుల సంఘం మధ్య వైరుధ్యం పెరిగాయి. దీంతో రూప్ సింగ్.గడ్డి మందును కురువ సంఘానికి చెందిన పంట పొలాలలో వరి నాట్ల పైన మందులు పిచికారి చేశాడు దీంతో వరి నారు పూర్తిగా మాడిపోయింది. కురుమ సంఘం చేసేదేమి లేక కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకొని కలెక్టర్కు విరుతి పత్రం సమర్పించారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని నాశనం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



హిందూ జంటలు ఒక్క సంతానంతో ఆపొద్దు. ఇద్దరిని కనాలి. అవకాశం ఉన్నవాళ్లు ముగ్గురికి జన్మనివ్వాలి. రాష్ట్రంలో హిందువుల బర్త్ రేట్ తగ్గుదల ఆందోళన కలిగిస్తోంది. మైనారిటీలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో జననాల రేటు ఎక్కువగా ఉంది. ముస్లింలు 7-8 మంది పిల్లల్ని కనొద్దు.

- అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ

మరొకరి జోక్యం లేనే లేదు

- ఇండియా పాక్ మధ్య చైనా మధ్యవర్తిత్వం వ్యాఖ్యలను ఖండించిన భారత్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 31: ఇండియా, పాకిస్థాన్ మధ్య ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. అయితే ఇండోపాక్ మధ్య శాంతి నెలకొల్పేందుకు తాము మధ్యవర్తిత్వం వహించినట్లు చైనా ప్రకటించింది. చైనా వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. పాక్‌తో కాల్పుల విరమణలో మూడో పక్షం జోక్యం లేదని స్పష్టం చేసింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత మే 10న జరిగిన కాల్పుల విరమణ.. రెండు దేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ మధ్య ప్రత్యక్ష చర్చల ద్వారా కుదిరిందని వెల్లడించింది. 'మేము ఇప్పటికే అలాంటి వాదనలను తోసిపుచ్చాము. భారత్‌పాక్ మధ్య సమస్యల పరిష్కారానికి మూడో పక్షం ప్రమేయం లేదు. రెండు దేశాల డీజీఎమ్‌వోలు నేరుగా సంప్రదింపులు జరిపి కాల్పుల విరమణ ఒప్పందాన్ని అంగీకరించారు. ఈ విషయంపై గతంలో అనేక సందర్భాల్లో మా వైఖరిని స్పష్టం చేశాము' అని ప్రభుత్వం స్పష్టం చేసింది. పెహల్గామ్ ఉగ్రదాడి ఘటన తర్వాత పాకిస్థాన్‌పై భారత్ సైనిక చర్య చేపట్టింది. అయితే రెండు దేశాల డీజీఎంవోల చర్చల తర్వాతే ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేసినట్లు భారత్ పేర్కొన్నది. కానీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాత్రం ఇరు దేశాల మధ్య సంధికి తానే కీలక పాత్ర పోషించినట్లు చెప్పుకుంటున్నారు. సుంకాల బెదిరింపులతో రెండు దేశాలు దిగొచ్చాయని ప్రపంచ వ్యాప్తంగా చాటింపు వేసుకుంటున్నారు. అయితే, ట్రంప్ ప్రకటనలను భారత్ ఎప్పటికప్పుడు ఖండిస్తూ వచ్చింది. పాక్‌తో జరిగిన సమరంలో మూడవ దేశ పాత్ర లేదని చెప్పింది. అయితే, ఇప్పుడు ట్రంప్ తరహాలోనే ఇండోపాక్ మధ్య శాంతిని నెలకొల్పడంలో తాము కూడా పాత్ర పోషించినట్లు ఇప్పుడు చైనా చెప్పడం గమనార్హం.



విశ్వ వీక్షణం



భారత్ వైఖరిని తప్పుబట్టిన జెలెన్‌స్కీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 31: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి చేసినట్లు వచ్చిన వార్తలను భారత్‌తోసహా పలు దేశాలు ఖండించిన విషయం తెలిసిందే. అయితే భారత ప్రధాని మోదీ చేసిన ఖండనను ఉక్రెయిన్ తప్పుపట్టింది. కొన్ని దేశాలు గందరగోళంగా, అసహ్యకరంగా ప్రవర్తిస్తున్నాయని, పుతిన్ ఇంటిపై డ్రోన్ దాడి ఘటనను ఖండిస్తున్నట్లు ఇండియా, యూఏఈ దేశాలు పేర్కొన్నాయని, వాస్తవానికి ఆ దాడి జరగలేదని ఆన్‌లైన్ మీడియా సమావేశంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. డిసెంబర్ 28వ తేదీ రాత్రి పుతిన్ ఇంటిపై ఉక్రెయిన్ సుమారు 91 కమికేజ్ లాంగ్ రేంజ్ డ్రోన్లతో దాడి చేసినట్లు రష్యా విదేశాంగ మంత్రి లవ్రోవ్ తెలిపారు. నోవ్‌గోరాడ్ ప్రాంతంలో ఉన్న పుతిన్ ఇంటిపై అటాక్ జరిగినట్లు ఆయన పేర్కొన్నారు. ఆ దాడిలో ఎవరికీ ఏమీకాలేదన్నారు. భౌతిక నష్టం కూడా జరగలేదన్నారు. అన్ని యూఏవీలను రష్యా కూల్చివేసిందన్నారు. అయితే ఆ దాడి తాము చేయలేదని ఉక్రెయిన్ నేత జెలెన్‌స్కీ వెల్లడించారు. రష్యా చేస్తున్న దాడులతో మా పిల్లలు మరణిస్తున్నారని, ఇలాంటి సంఘటనలను ఏ దేశం కూడా ఖండించడం లేదని, ఇండియా కానీ లేక యూఏఈ కానీ ఆ ఘటనలను ఖండించడం లేదని జెలెన్‌స్కీ అన్నారు.



ఇంటి నిండా డబ్బే!

- ఈడీ దాడుల్లో 14 కోట్లు స్వాధీనం


ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 31: ఢిల్లీలోని ఓ ఇంటిపై ఈడీ అధికారులు దాడులను చేపట్టగా బంగారం, వజ్రాలు, కోట్ల రూపాయల నగదు కట్టలతో నిండిన సూట్‌కేసులు లభ్యమయ్యాయి. రూ.14 కోట్ల విలువజేసే సొత్తును ఈడీ స్వాధీనం చేసుకుంది. ఢిల్లీకి చెందిన రావ్ ఇందర్‌జిత్ యాదవ్ సహచరుడు అమన్‌కుమార్‌కు సంబంధించి ఒక ప్రాంగణం నుంచి ఈ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు ప్రకటించారు. రూ.5 కోట్లకుపైగా నగదు, రూ.8.8 కోట్లు విలువజేసే బంగారం, వజ్రాలతో నిండిన మరో సూట్‌కేసు, రూ.35 కోట్ల ఆస్తులకు సంబంధించిన చెక్‌బుక్‌లు, డాక్యుమెంట్స్‌తో నిండిన బ్యాగ్ లభ్యమయ్యాయని ఈడీ తెలిపింది. హత్య, మోసం, దోపిడీ సహా వివిధ నేరాలకు సంబంధించి రావ్ ఇందర్‌జిత్‌పై 15కుపైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. రావ్ ఇందర్‌జిత్ కోసం ప్రస్తుతం ఈడీ, హర్యానా పోలీసులు గాలిస్తున్నారు.



న్యూ ఇయర్ వేళ సమ్మెలో గిగ్ వర్కర్లు


- ప్రోత్సాహకాలు ప్రకటించిన స్విగ్గీ, జొమాటో

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 31: మెరుగైన వేతనాలు, పని పరిస్థితులను డిమాండు చేస్తూ దేశవ్యాప్తంగా బుధవారం గిగ్ వర్కర్లు సమ్మె చేపట్టారు. దీంతో నూతన సంవత్సర వేడుకల వేళ స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్, జెప్టో, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ తదితర సేవలకు కొంతమేర అంతరాయం ఏర్పడింది. గిగ్ వర్కర్స్ సమ్మె పిలుపు నేపథ్యంలో నూతన సంవత్సర వేడుకలకు ఎటువంటి అవాంతరాలు ఏర్పడకుండా ఉండేందుకు ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫారాలైన జొమాటో, స్విగ్గీ తమ డెలివరీ పార్ట్‌నర్స్‌కి ఇన్సెంటివ్‌లు పెంచాయి. పండుగల సీజన్‌లో ఈ రకంగా ఇన్సెంటివ్‌లు పెంచడం సర్వసాధారణంగా జరిగేదేనని తెలుస్తోంది. దేశవ్యాప్త సమ్మెలో లక్షలాది మంది వర్కర్స్ చేరుతున్నట్లు తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బేస్డ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ బుధవారం వెల్లడించాయి. కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా సమ్మె ప్రభావం వల్ల జొమాటో, స్విగ్గీ, బ్లింకిట్, ఇన్‌స్టామార్ట్, జెప్టో వంటి ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ ప్లాట్‌ఫారాల సేవలకు అంతరాయం ఏర్పడింది. పీక్ అవర్స్‌లో ప్రతి ఆర్డర్‌కు రూ. 120 నుంచి రూ. 150 వరకు ఇన్సెంటివ్‌లు చెల్లించేందుకు జొమాటో తన డెలివరీ పార్ట్‌నర్స్‌కు సంసిద్ధత తెలిపింది.



'ప్రళయ్' క్షిపణి ప్రయోగం సక్సెస్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 31: భారత రక్షణ రంగం మరో కీలక మైలురాయిని చేరుకుంది. ఒడిశా తీరం లో ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి 'ప్రళయ్' ని విజయవంతంగా పరీక్షించింది. ఒకే లాంచర్ నుంచి రెండు క్షిపణులను స్వల్ప వ్యవధిలో ప్రయోగించి వాటి సామర్థ్యాన్ని విజయవంతంగా పరిశీలించింది. యూజర్ ఎవాల్యుయేషన్ ట్రయల్స్‌లో భాగంగా ఈ పరీక్షలు నిర్వహించినట్లు రక్షణశాఖ వెల్లడించింది. బుధవారం ఉదయం 10:30 గంటల సమయంలో రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రయోగం జరిగింది. ప్రయోగించిన రెండు క్షిపణులు నిర్దేశిత మార్గంలో ప్రయాణించి, లక్ష్యాలను కచ్చితత్వంతో చేధించాయని అధికారులు తెలిపారు. చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో మోహరించిన ట్రాకింగ్ సెన్సార్ల ద్వారా క్షిపణి పనితీరును ధృవీకరించుకున్నారు. డీఆర్డీవో సీనియర్ శాస్త్రవేత్తలు, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ ఉన్నతాధికారులు ఈ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు.



ప్రీ-డయాబెటిస్ ఓ హెచ్చరిక..



డా. కౌశల్ గోవర్ధన
వైస్ చైర్మన్
శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
డా. ధనుంజయ
నర్సింగ్ హోమ్
7702417779

వయసుతో సంబంధం లేకుండా చాలామంది డయాబెటిస్ బారినపడుతున్నారు. స్కూల్, కాలేజీకి వెళ్లే సమయంలో ఆట పాటలతో ఆనందంగా ఉండే వారు, ఉద్యోగంలో చేరినప్పటి నుంచి పని ఒత్తిడితో కుంగిపోతున్నారు. కూర్చుని చేసే పనే అయినా రోజంతా ఏదో తెలియని నీరసం, నిస్సత్తువతో కాలం గడిపేస్తున్నారు. దీంతో బాడీలో బెల్లీ ఫ్యాట్ పెరుగుతుంది. వైద్యుని దగ్గరికి వెళ్లి పరీక్ష చేయించుకుంటే రక్తంలో గ్లూకోజు మోతాదులు పెరిగాయని, డయాబెటిస్ కి దగ్గర్లో ఉన్నారని చెబుతారు. అసలు ప్రీ డయాబెటిస్ అంటే ఏమిటి? ఇది డయాబెటిస్ గా మారుతుందా? అలా కాకూడదంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి? "ప్రీడయాబెటిస్ ఉందని గుర్తించిన వారిలో కొంతమంది తమకు టైప్ 2 డయాబెటిస్ కచ్చితంగా వస్తుందని అనుకుంటారు. కానీ, ఈ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు"

దీనికి వైద్యపరమైన పేర్లు:

1) ఇంపైర్డ్ గ్లూకోజ్ టాలరెన్స్ (IGT) అంటే మీ రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణం కంటే ఎక్కువగా ఉండటం, కానీ డయాబెటిస్ ఉన్నంత ఎక్కువగా లేకపోవడం; దీనిని ప్రీడయాబెటిస్ లేదా బార్డర్‌లైన్ డయాబెటిస్ అని కూడా అంటారు, దీనిలో మీ శరీరం ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించలేదు, దీనివల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది, దీనిని ఆహారం, వ్యాయామం ద్వారా నియంత్రించవచ్చు.

2) ఇంపైర్డ్ ఫాస్టింగ్ గ్లూకోజ్ (Impaired Fasting Glucose IFG) అంటే, మామూలుగా ఉపవాసం ఉన్నప్పుడు ఉండే రక్తంలో చక్కెర స్థాయిల కంటే కొద్దిగా ఎక్కువగా ఉండటం, కానీ మధుమేహం (డయాబెటిస్) స్థాయికి చేరకపోవడం; దీనిని ప్రీడయాబెటిస్ (Prediabetes) రకంగా పరిగణిస్తారు, ఇది భవిష్యత్తులో టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదాన్ని సూచిస్తుంది మరియు జీవనశైలి మార్పులతో దీనిని తగ్గించవచ్చు. రక్తంలో చక్కెర స్థాయిలు 100 mg/dL నుండి 125 mg/dL (5.6 నుండి 6.9 mmol/L) మధ్య ఉన్నప్పుడు IFG అని అంటారు, ఇది టైప్ 2 డయాబెటిస్‌కు దారితీయవచ్చు.

మధుమేహం అనగానే చాలామంది భయాందోళనలకు గురవుతారు. కానీ ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించడం ద్వారా మధుమేహం మాత్రమే కాకుండా అనేక ఇతర జీవనశైలి సంబంధిత వ్యాధుల నుంచి కూడా సులువుగా బయట పడవచ్చు... మధుమేహం అనేది ఒక రకమైన సైలెంట్ కిల్లర్, ఇది శరీరాన్ని క్రమంగా బలహీనపరుస్తుంది. దీని వల్ల శరీరంలోని ముఖ్యమైన అవయవాలైన కిడ్నీలు, కళ్లు మొదలైన వాటిపై ప్రభావం పడుతుంది... "ఇన్సులిన్ అనేది క్లోమంలో ఉత్పత్తి అయ్యే హార్మోన్, ఇది రక్తంలో గ్లూకోజ్ (చక్కెర) ను సాధారణ స్థాయిలో ఉంచడానికి సహాయపడుతుంది. ఒక వ్యక్తి అధిక బరువుంటే, అది కూడా పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోతే, రక్తంలో గ్లూకోజ్ లెవల్స్‌ను నియంత్రించడం ఇన్సులిన్‌కు కష్టంగా మారుతుంది. శరీరంలో కొవ్వు శాతం అధికంగా ఉంటే ఇన్సులిన్ ప్రభావం మరీ తక్కువగా ఉంటుంది. అందుకే దీన్ని నియంత్రించేందుకు శరీరం అధికంగా ఇన్సులిన్ విడుదల చేస్తుంది. అయితే ఇది ఎక్కువ కాలం సాధ్యం కాదు" అందుకే, శరీరంలో అధికంగా కొవ్వు పేరుకుపోవడం, తిండి అలవాట్ల వల్ల ప్రీడయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది.

ప్రీ డయాబెటిక్ లక్షణాలు :

- పొట్ట భాగంలో కొవ్వు పేరుకుపోవడం
- శక్తి, ఉత్సాహం తగ్గిపోవడం
- జ్ఞాపకశక్తి, ఏకాగ్రత లోపించడం,
- సరిగా ఆలోచించలేకపోవటం
- ఎప్పుడూ ఏదో ఒకటి తినాలనిపించడం
- నిద్రలేమి సమస్యలు
- స్వల్పంగా నిరాశ,
- దిగులుబట్టతల ముందుగానే రావటం

ప్రీ డయాబెటిస్ లో ఉన్నవారు వెంటనే జీవనశైలి, ఆహారంలో మార్పులు చేసుకోవడం ద్వారా డయాబెటిస్ లోకి వెళ్లకుండా చూసుకోవచ్చు. ముఖ్యంగా ఆరోగ్యకర జీవన శైలి, ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. జన్యుపరమైన, పర్యావరణ పరమైన అంశాలు కూడా మధుమేహానికి కారణమవుతాయి. ఆహారం రూపంలో రక్తంలోకి వచ్చే గ్లూకోజ్ (షుగర్) పరిమాణాన్ని నియంత్రించేది ఇన్సులిన్. దీన్ని పాంక్రియాస్ ఉత్పత్తి చేస్తుంది. మధుమేహం సమస్యలో ఇన్సులిన్ తగినంత ఉత్పత్తి కాదు. ఎక్కువ మందిలో ప్రీ డయాబెటిస్ దశలో లక్షణాలు కనిపించకపోవచ్చు. రెగ్యులర్ గా హెల్త్ చెకప్ లు చేసుకోవడం మంచి మార్గం.

ప్రీ-డయాబెటిస్ అంటే..

ప్రీడయాబెటిస్ అనేది తీవ్రమైన ఆరోగ్య సమస్య. ఇది వస్తే రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయి. కానీ షుగర్ వ్యాధి వచ్చిందని నిర్ధారించేంత లక్షణాలు కనిపించవు. ప్రీడయాబెటిస్‌తో బాధపడుతున్న వారికి టైప్ 2 డయాబెటిస్, హార్ట్ స్ట్రోక్, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉంటుంది. సాధారణంగా ప్రీడయాబెటిస్ కండీషన్ ఎలాంటి లక్షణాలను, సంకేతాలను చూపించదు. శరీరంలో ఏ చిన్న మార్పు కనిపించినా వెంటనే మీ వైద్యుడిని సంప్రదించడం మేలు. ప్రీడయాబెటిస్ అనేది మెటబాలిక్ సిండ్రోమ్ లో ఒకటి. ఇందులోనూ షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉంటాయి. కాకపోతే డయాబెటిస్ గుర్తించేంత స్థాయిలో ఉండవు, అలాగే నార్మల్ గాను ఉండవు . ఉదయం ఏమి తినక ముందు షుగర్ లెవల్స్ 100125, అదే భోజనం చేసిన రెండు గంటల తర్వాత 140200, వీటిలో ఏ ఒక్కటున్నా ప్రీ డయాబెటిస్ లో ఉన్నారని చెప్పచ్చు. అయితే మన దేశంలో ఎంతో మంది ఇలాంటి పరిస్థితే ఎదుర్కొంటున్నారని పలు నివేదికల్లో వెల్లడైంది. జీవనశైలిలో మార్పులు లేకుంటే, ప్రీ డయాబెటిస్ ఉన్న పెద్దలు, పిల్లలకు టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది..

ప్రీ-డయాబెటిస్ ఎప్పుడు డయాబెటిస్‌గా మారుతుంది?

ప్రీడయాబెటిస్‌తో బాధపడుతున్న వారికి 5 నుండి 10 సంవత్సరాలలో మధుమేహం వచ్చే అవకాశం 50 శాతం వరకు ఉంటుంది. ప్రీడయాబెటిస్ ఉన్న ప్రతి ఒక్కరికీ డయాబెటిస్ రాకపోవచ్చు. ఇది ఉన్నవారిలో దాదాపు 25 శాతం మందికి 35 సంవత్సరాల మధ్యలో స్వల్పంగా మధుమేహ లక్షణాలు కనిపిస్తున్నాయి..

ప్రీ - డయాబెటిస్ రాకుండా జాగ్రత్తలు...

బరువు అదుపులో ఉంచండి

కొంతమంది తక్కువ కేలరీల ఆహారాన్ని అనుసరించడం ద్వారా చాలా త్వరగా బరువు తగ్గుతారు. కానీ, అలాంటి ఆహారాన్ని ఎక్కువ కాలం కొనసాగించడం సాధ్యం కాదు. అందుకే, మీ బరువును అదుపులో ఉంచడానికి ఒక మార్గాన్ని కనుగొనడం చాలా ముఖ్యం. శాకాహారం, వేగన్ ఆహారాలను తీసుకోవడం, కార్బోహైడ్రేట్లను పరిమితం చేయడం వంటివి టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని రాకుండా తగ్గించవచ్చు.. భవిష్యత్తులో టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఉందనేందుకు శరీరంలో గ్లూకోజ్ స్థాయి పెరగడమే సంకేతం. ప్రీ డయాబెటిస్ దశలో రక్తంలో గ్లూకోజ్ స్థాయి సాధారణం కంటే అధికంగా ఉంటుంది. కానీ, చక్కెర వ్యాధి నిర్దారణ అయ్యాక ఉన్నంత ఎక్కువగా ఉండదు. ఊబకాయం, శారీరక శ్రమ లేకపోవడం, ఆహారం, కుటుంబ చరిత్ర, వయస్సు వంటి అనేక కారణాల వల్ల ఈ సమస్య వస్తుందని తెలిసిందే. డయాబెటిస్ ఒకసారి సోకితే జీవితాంతం పోదని తెలుసు. కానీ, మంచి విషయం ఏంటంటే.. ప్రీడయాబెటిస్ లక్షణాలు మీలో ఉంటే దానిని నయం చేసేందుకు ఛాన్స్ ఉంటుంది.

- కార్బోహైడ్రేట్లను తగ్గించే బదులు ఆహార పదార్థాల గ్లైసెమిక్ ఇండెక్స్, గ్లైసెమిక్ లోడ్‌పై దృష్టి పెట్టడం ప్రారంభించండి. రక్తంలో చక్కెర పెరుగుదలను నివారించి నెమ్మదిగా గ్లూకోజ్‌ను విడుదల చేసే ఆహార పదార్థాలను మాత్రమే ఎంచుకోండి.
- సూక్ష్మ ఖనిజ లోపం ఉందేమో తనిఖీ చేసుకోండి. ముఖ్యంగా మెగ్నీషియం, జింక్, క్రోమియం మొదలైనవి. ప్రీడయాబెటిస్ మూల కారణాన్ని అర్థం చేసుకోవడానికి ఇన్సులిన్ ఫాస్టింగ్, HOMAIR పరీక్షలు చేయించుకోండి.
- రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేసే కార్టిసాల్ హార్మోన్ నియంత్రించాలంటే రోజూ 79 గంటలు తప్పకుండా నిద్రపోవాలి.
- ప్రీడయాబెటిస్‌ను తిప్పికొట్టడానికి అల్పాహారం అతి ముఖ్యమైన భోజనాలలో ఒకటి. అధిక ప్రోటీన్ కలిగిన అల్పాహారం తీసుకోవడంపై దృష్టి పెట్టండి.
- అసిడిటీని అదుపులో ఉంచుకుంటూ యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారం తీసుకోండి. ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో సహాయపడే హోం టిప్స్ ప్రయత్నించండి.
- రోజు అరగంట పాటు కచ్చితంగా వ్యాయామం చేయడం. చురుకైన నడక, సైక్లింగ్ లేదా ఈత కొట్టడం వంటివి చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వండి.
- అదనపు కొవ్వును నివారించేందుకు ప్రయత్నించండి. అలాగే ధూమపానాన్ని నివారించండి. దీనివల్ల, టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది.
- గట్ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ప్రోబయోటిక్స్ అధికంగా ఉండే ఆహారం తీసుకోండి.
- ఒత్తిడి రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తుంది కాబట్టి, దానిని నిర్వహించడానికి ఆరోగ్యకరమైన మార్గాలు అనుసరించండి.
- ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. కాబట్టి పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, చిక్కుళ్ళు వంటి ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలకు ప్రాధాన్యత ఇవ్వండి. వీటి వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు లభించడంతో పాటు కడుపు నిండిన భావన కలిగి బరువు నియంత్రణలో ఉంటుంది. రోజులో 56 సార్లు తక్కువ మోతాదులో ఏదొక ఆహారం తీసుకుంటూ ఉండటం అలవాటు చేసుకోండి.

"కొన్ని ఆహారాలు, పానీయాలు టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తాయని పరిశోధనలో తేలింది" వీటిలో పండ్లు, కూరగాయలు (ముఖ్యంగా ఆకుకూరలు, ద్రాక్ష, ఆపిల్స్), తృణధాన్యాలు, పెరుగు, జున్ను, చక్కెర లేని టీ, కాఫీ ఉన్నాయి. రోజు తృణధాన్యాలు (సుమారు 45 గ్రాములు) తినడం వల్ల టైప్ 2 డయాబెటిస్ ప్రమాదం 20 శాతం తగ్గించవచ్చని 2015లో జరిపిన ఒక అధ్యయనంలో తేలింది. ప్రతిరోజూ పాల ఉత్పత్తులను తీసుకునే వ్యక్తులు మధుమేహ ప్రమాదాన్ని 5 శాతం తగ్గించుకోవచ్చు. తక్కువ కొవ్వు పాల ఉత్పత్తులను తీసుకుంటే 10 శాతం తగ్గించుకోవచ్చు. పెరుగును క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఈ ప్రమాదాన్ని 14 శాతం తగ్గించుకోవచ్చని కొన్ని పరిశోధనలో తేలింది.

"ప్రీ-డయాబెటిస్‌ను పూర్తిగా వెనక్కి మళ్లించవచ్చని చెప్పడానికి ఇంకా విస్తృత పరిశోధనలు జరగాలి. కానీ, సరైన జీవనశైలి మార్పులతో, అవసరమైతే మందులతో, దీనిని పూర్తిస్థాయి డయాబెటిస్‌గా మారకుండా కచ్చితంగా నివారించవచ్చు."





ఆటలు

@prathipaksham

prathipaksham tv telugu

2026 ఆటల సంవత్సరం

క్రికెట్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, హాకీ, చదరంగం.. ఇలా 2026లో ఆటలే ఆటలు.. ప్రపంచ టోర్నీల సందడే సందడి! క్రికెట్ లో భారత పురుషుల యువ, సీనియర్ జట్లు ప్రపంచకప్‌లో సమరానికి సన్నద్ధమవుతున్నాయి. భారత్ వేదికగా టీ20 ప్రపంచకప్‌తో ఈ క్రీడా సీజన్‌కు ఘనమైన ఆరంభం లభించనుంది. బ్యాడ్మింటన్‌లో జోరు కొనసాగించేందుకు ప్రపంచ చాంపియన్‌షిప్.. లిఫ్టర్లు, షూటర్లు సత్తా చాటేందుకు ఆసియా చాంపియన్‌షిప్, టీటీ క్రీడాకారులకు డబ్ల్యూటీటీ స్టార్ కంటెండర్.. ఇలా ఎన్నో ఈవెంట్ల ఆతిథ్యానికి భారత్ ముస్తాబవుతోంది. ఇవే కాదు.. ఇంకా ఎన్నో క్రీడలు, మరెన్నో పోటీలు..వ్యక్తిగత ప్రతిభ చాటే ఈవెంట్లు, జట్టుగా కలిసి తలపడే టోర్నీలు.. ఇలా భారత్‌తో పాటు విశ్వవ్యాప్తంగా వివిధ దేశాల్లో క్రీడా సంబరాన్ని అందించేందుకు కొత్త ఏడాది ముస్తాబైంది. ఇక, ఆటగాళ్లు బరిలోకి దిగి విజయాలు అందుకోవడమే ఆలస్యం. టాటా స్టీల్ చెస్ (జనవరి 16ఫిబ్రవరి 1: నెదర్లాండ్స్); ఫిడే క్యాండిడేట్స్ టోర్నీ (మార్చి 28 ఏప్రిల్ 15: సైప్రస్); చెస్ ఒలింపియాడ్ (సెప్టెంబరు 417: ఉజ్బెకిస్థాన్); ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ (గుకేష్ క్యాండిడేట్స్ విజేత: షెడ్యూల్ ఖరారవ్వాలి); వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ చాంపియన్‌షిప్ (షెడ్యూల్ ఖరారవ్వాలి). కొత్త ఏడాది పూర్తిగా క్రికెట్ పండుగ అని చెప్పుకోవచ్చు. ఈ బ్యాటు, బంతి క్రీడలో భాగంగా మూడు ప్రపంచకప్‌లు అభిమానులను కనువిందు చేయనున్నాయి. జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న అండర్ 19 50 ఓవర్ల ప్రపంచకప్‌తో పాటు పురుషుల, మహిళల టీ20 ప్రపంచకప్‌లు ఈ ఏడాదిలోనే జరగనున్నాయి. ఈ మెగా టోర్నీలతో పాటు ఇతర జట్లతో టీమిండియా తలపడే వన్డే, టీ20, టెస్టు సిరీస్‌లు.. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్), మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఎలాగూ ఉంటాయి. మహిళల ప్రీమియర్ లీగ్ (జనవరి 9 ఫిబ్రవరి 5); అండర్ 19 వన్డే ప్రపంచకప్ (జనవరి 15 ఫిబ్రవరి 6: జింబాబ్వే, నమీబియా); పురుషుల టీ20 ప్రపంచకప్ (ఫిబ్రవరి 7 మార్చి 8: భారత్, శ్రీలంక); ఇండియన్ ప్రీమియర్ లీగ్ (మార్చి 26 మే 31); మహిళల టీ20 ప్రపంచకప్ (జూన్ 12 జులై 5: ఇంగ్లండ్).



బరువు తగ్గిన శ్రేయస్ అయ్యర్

స్టార్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ గ్రౌండ్‌లో అడుగుపెట్టడం మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో అతను గాయపడ్డ విషయం తెలిసిందే. క్యాచ్ అందుకోబోయి కింద పడ్డ అయ్యర్‌కు .. కడుపులో మోచేయి వత్తేసింది. దీంతో అతని ప్లీహం (స్ప్లీన్) దెబ్బతిన్నది. దాని నుంచి రక్తస్రావం జరిగింది. అయితే ప్రమాదం నుంచి ఇంకా కోలుకుంటున్న శ్రేయాస్ అయ్యర్.. న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు అందుబాటులో ఉంటాడన్న అనుమానాలు వ్యక్తం అయ్యాయి. కానీ ఓ నివేదిక ప్రకారం మాత్రం ప్రమాదం తర్వాత అయ్యర్ సుమారు ఆరు కిలోల బరువు తగ్గినట్లు తెలుస్తోంది. అతని మాంస కణజాలం తగ్గడం వల్ల బరువు చాలా వేగంగా కోల్పోయినట్లు డాక్టర్లు చెబుతున్నారు. విజయ్ హజారే ట్రోఫీలో శ్రేయాస్ అయ్యర్ ఆడే అవకాశాలు ఉన్నట్లు ఓ మీడియా కథనాన్నిరాసింది. జనవరి 3, 6వ తేదీల్లో జరిగే మ్యాచుల్లో అతను ఆడుతాడని డౌట్ వ్యక్తం చేసింది. దీంతో కివీస్‌తో జరిగే వన్డే సిరీస్‌కు అయ్యర్ అందుబాటులో ఉంటాడని కూడా ఊహాగానాలు వినిపించాయి. అయితే శ్రేయార్ అయ్యర్ 50 ఓవర్ల మ్యాచ్ ఆడగలడా లేదా అన్నది సందేహంగా ఉన్నట్లు బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. కడుపు సర్జరీ కావడం వల్ల అతను ఫిజికల్‌గా గ్రౌండ్‌లో గడపడం ఎంత వరకు వీలు అవుతుందో తెలియదన్నారు. కానీ శ్రేయాస్ మాత్రం స్కిల్ ట్రైనింగ్ ప్రారంభించాడు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగానే ఉన్నది. 50 ఓవర్లకు తగినట్లు అతను ఫీల్డింగ్ చేయగలిగితే అప్పుడు విజయ్ హజారేలో ఆడే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.



కోమాలో ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్

ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డామియన్ మార్టిన్ కోమాలోకి వెళ్లారు. 54 ఏళ్ల వయసున్న ఆ మాజీ బ్యాటర్.. బాక్సింగ్ డే రోజున కోమాలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. మెనింజిటిస్ వ్యాధితో బాధపడుతున్న అతను క్వీన్స్‌ల్యాండ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ అయిన డామియన్ మార్టిన్ ఆస్ట్రేలియా జాతీయ జట్టు తరఫున 67 టెస్టులు, 208 వన్డేలు ఆడాడు. ప్రస్తుతం డేమియన్ మార్టిన్‌కు ఇండ్యూస్డ్ కోమా పద్ధతిలో చికిత్స అందిస్తున్నారు. ఆసీస్ మాజీ క్రికెటర్లు సోషల్ మీడియాలో రియాక్ట్ అవుతున్నారు. మార్టిన్‌కు అత్యుత్తమ చికిత్స అందిస్తున్నారని, ఫ్యామిలీ ధైర్యంగా ఉండాలని ఆడమ్ గిల్‌క్రిస్ట్ తెలిపారు. 1992 నుంచి 2006 మధ్య కాలంలో ఆస్ట్రేలియా తరఫున డామియన్ మార్టిన్ 67 టెస్టులు ఆడాడు.2000 సంవత్సరంలో ఆరేళ్ల గ్యాప్ తర్వాత అతన్ని మళ్లీ జట్టులోకి తీసుకున్నారు. స్టీవ్ వా నేతృత్వంలోని ఆసీస్ జట్టులో అతను కీలక బ్యాటర్‌గా కొనసాగాడు. 2006 యాషెస్ సిరీస్ మధ్యలో అతను అకస్మాత్తుగా రిటైర్ అయ్యాడు. టెస్టుల్లో అతను 46 సగటుతో 4406 పరుగులు చేశాడు. దీంట్లో 13 సెంచరీలు ఉన్నాయి. 2003లో ఆస్ట్రేలియా వన్డే వరల్డ్‌కప్ గెలిచింది. ఆ జట్టులో మార్టిన్ ఉన్నాడు. ఇండియాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మార్టిన్ 88 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. రికీ పాంటింగ్‌తో కలిసి 234 రన్స్ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వన్డేల్లో డామియన్ మార్టిన్ 40 సగటుతో 5346 రన్స్ చేశాడు. దీంట్లో అయిదు సెంచరీలు ఉన్నాయి.



సర్ఫరాజ్ డబుల్ సెంచరీ మిస్

ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ ఈ సీజన్ దేశవాళీ పోటీల్లో తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ మరో సెంచరీతో చెలరేగాడు. అయితే త్రుటిలో ద్విశతకాన్ని చేజార్చుకున్నాడు. విజయ్ హజారే ట్రోఫీ టోర్నీలో భాగంగా గోవాతో బుధవారం జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో సర్ఫరాజ్ సిక్సర్ల వర్షం కురిపించాడు. 75 బంతుల్లోనే 14 సిక్సర్లతో సర్ఫరాజ్ 157 పరుగులు చేయడంతో తొలుత ముంబై 50 ఓవర్లలో 444/8 స్కోరు సాధించింది.. సర్ఫరాజ్ సోదరుడు ముషీర్ ఖాన్ (60), హార్దిక్ తమోర్ (53) సత్తా చాటారు. భారీ ఛేదనలో గోవా 50 ఓవర్లలో 357/9 స్కోరు చేసి ఓడింది. అభినవ్ తేజ్ రాణా (100) శతక్కొట్టగా, దీప్‌రాజ్ (70), లలిత్ యాదవ్ (64) పోరాడారు.




నవ్వులు పంచే భర్త మహాశయ

రవితేజ నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిషోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌లో వేగం పెంచారు. సినిమాలోని 'వామ్మో వాయ్యో' అనే గీతాన్ని ఈ నెల 2న విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం సాంగ్ ప్రోమోను రిలీజ్ చేశారు. ఇందులో నాయకానాయికలు రవితేజ, ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి కలర్‌ఫుల్ అవుట్‌ఫిట్స్‌లో హుషారుగా స్టెప్పులేస్తూ కనిపిస్తున్నారు. పండుగ జోష్‌ను తెరపై ఆవిష్కరించే మాస్ సాంగ్ ఇదని, గ్రాండ్ విజువల్స్‌తో ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. ఆద్యంతం వినోదాత్మకంగా ఈ చిత్రాన్ని రూపొందించామని, రవితేజ తనదైన శైలి కామెడీతో అలరిస్తారని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్నందిస్తున్నారు.



ఎమోషనల్ లవ్ అండ్ ఫ్యామిలీ డ్రామా 'బ్యూటీ'

ఎప్పటికప్పుడు కొత్త సినిమాలు, సిరీస్‌లతో వైవిధ్యమైన కంటెంట్‌ను ప్రేక్షకులకు అందిస్తూ దేశంలోనే టాప్ ఓటీటీ మాధ్యమాల్లో ఒకటిగా గుర్తింపు సంపాదించుకున్న జీ 5..మరోసారి తన విలక్షణతను చాటుకుంటూ కొత్త సినిమా 'బ్యూటీ'తో ప్రేక్షకులకు అందిస్తోంది. డిఫరెంట్ మూవీస్‌లో నటిస్తూ మెప్పిస్తోన్న అంకిత్ కొయ్య హీరోగా, నిలఖి పాత్రా హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం జీ 5లో జనవరి 2 నుంచి స్ట్రీమింగ్ కానుంది. హృదయాన్ని హత్తుకునే క్యూట్ లవ్‌స్టోరీ ఓ వైపు.. కూతురిపై అపరిమితమైన ప్రేమను చూపించే తండ్రి భావోద్వేగం మరో వైపు.. ఈ సంఘర్షణలో కథ ఎలాంటి మలుపులు తీసుకుందనే ఆసక్తికరమైన మలుపులున్న కథాంశంతో బ్యూటీ సినిమాను రూపొందింది. సెప్టెంబర్ 15న విడుదలైన ఈ చిత్రం థియేటర్స్‌లో ప్రేక్షకుల ప్రశంసలను అందుకుని ఇప్పుడు జీ 5లో జనవరి 2 నుంచి అందరికీ అందుబాటులోకి రానుంది. అలేఖ్య (నిలఖి పాత్రా), అర్జున్ (అంకిత్ కొయ్య) ప్రేమించుకుంటారు. అలేఖ్య తండ్రి నారాయణ (వీకే నరేష్) ఓ క్యాబ్ డ్రైవర్. కూతురంటే మాటల్లో చెప్పలేని ప్రేమ. కూతురికి బర్త్ డే గిఫ్ట్‌గా టూ వీలర్ బండిని కొనిస్తానని ప్రామిస్ చేస్తాడు. అలాగే అర్జున్ కూడా ఆమెకు బండి కొనిస్తానని ప్రామిస్ చేస్తాడు. తండ్రి మాటపై నిలబడకపోవటంతో అలేఖ్య తండ్రితో గొడవపడి వెళ్లిపోతుంది. అర్జున్, నారాయణ ఆమె నిర్ణయంతో ఎలాంటి ఇబ్బందులు పడ్డారు. కోపంతో తీసుకున్న నిర్ణయం అలేఖ్యను ఎలాంటి ఇబ్బందుల్లో పడేసింది..నారాయణ కూతుర్ని కాపాడుకోవటానికి ఏం చేస్తాడు? చివరకు ఆమె ఎలా బయటపడిందనేదే సినిమా కథాంశం.



'టాక్సిక్: ఎ పెయిరీటేల్ ఫర్ గ్రోన్ అప్స్' నయనతార.. ఫస్ట్ లుక్ రిలీజ్

రాకింగ్ స్టార్ యశ్ లేటెస్ట్ సెన్సేషనల్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' మార్చి 19న ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున రిలీజ్ అవుతోంది. ఈ క్రమంలో మేకర్స్ మూవీలోని ఎవరికీ తెలియని, ఆకట్టుకునే ప్రపంచాన్ని బయటపెడుతోంది. రోజు రోజుకీ సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే కియారా అద్వానీ, హుమా ఖురేషి పాత్రలకు సంబంధించిన ఫస్ట్ లుక్స్ విడుదల చేసిన మేకర్స్.. ఇప్పుడు గంగ పాత్రలో నటిస్తోన్న నయనతార పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ లుక్‌లో నయనతార అందంగా, పవర్‌ఫుల్‌గా కనిపిస్తోంది. యశ్ చేస్తోన్న ఈ బిగ్గెస్ట్ ప్రాజెక్ట్‌లో నయనతార పాత్ర చాలా కీలకంగా ఉండబోతుందని ఈ పోస్టర్ ద్వారా తెలుస్తోంది. తన స్టార్ పవర్, వైవిధ్యమైన ఎమోషనల్ యాక్టింగ్‌తో నయనతార భారతదేశంలోని స్టార్ హీరోయిన్స్‌లో ఒకరిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. అయితే ఇప్పుడు చేస్తోన్న టాక్సిక్ సినిమాలోని పాత్ర.. ఆమె ఇప్పటివరకు చేయనిది. ఈ సినిమాలో ఆమె ఓ డార్క్ వరల్డ్‌లోని పాత్రను పోషిస్తున్నారు. నయనతార తన సహజ సిద్ధమైన నటనతో బలమైన ప్రభావాన్ని చూపిస్తూ.. ప్రేక్షకులకు ఆ పాత్రను సరికొత్తగా అనిపించేలా పరిచయం చేయబోతుంది. గంగ పాత్రలోని నయనతార లుక్ చూస్తుంటే.. ఆమెలోని ధైర్యం, భయంలేని వైఖరి సినిమా భారీ స్థాయికి తగ్గట్టుగా కనిపిస్తోంది. పోస్టర్‌లో నయనన్. గంభీరమైన హావభావాలతో కనిపిస్తోంది. ఆమె చేతిలో తుపాకీ పట్టుకుని కనిపిస్తోన్న స్టైల్ అందంగా, మరోవైపు ప్రమాదకరంగా అనిపిస్తుంది. ఇది నాదంటూ చెప్పేలా, నా నిర్ణయాలు చెల్లుబాటవుతాయనే రీతిలో విశాలవంతమైన క్యాసినో ఎంట్రన్స్ దగ్గర నయన్ నిలుచుంది.

ఘనంగా రాజు గారి పెళ్లి రిసెప్షన్

మూడు వరుస ఘన విజయాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి, 2026 సంక్రాంతికి తన తదుపరి చిత్రం 'అనగనగా ఒక రాజు'తో అలరించనున్నారు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తుండగా, శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. నూతన దర్శకుడు మారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయిక. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు. అసలుసిసలైన పండగ చిత్రంగా జనవరి 14న థియేటర్లలో అడుగుపెట్టనున్న 'అనగనగా ఒక రాజు'పై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే ప్రచార చిత్రాలలో వైవిధ్యం చూపిస్తూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది ఈ చిత్రం. ఇక తాజాగా మరో వైవిధ్యమైన వేడుకను నిర్వహించింది చిత్ర బృందం. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ లోని రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్ లో 'రాజు గారి పెళ్లి రిసెప్షన్ వేడుక'ను ఘనంగా నిర్వహించారు. పాత్రికేయ మిత్రుల సమక్షంలో వైభవంగా జరిగిన ఈ వేడుకలో అడుగడుగునా వైవిధ్యం ఉట్టిపడింది. నాయకానాయికలు నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి 'అనగనగా ఒక రాజు' చిత్రంలోని 'భీమవరం బాల్మా', 'రాజు గారి పెళ్లిరో' పాటలకు వేదికపై నృత్యం చేసి అందరిలో ఉత్సాహం నింపారు. అనంతరం అతిథులందరికీ స్వాగతం పలికి, నిజంగానే పెళ్లి రిసెప్షన్ వేడుకను తలపించారు. ఇక నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి నూతన వధూవరులులా వేదికపై కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాత్రికేయులు బంధుమిత్రుల్లా ఒక్కొక్కరిగా వేదికపైకి వచ్చి.. ఆ జంటను ఆశీర్వదించడం, గిఫ్ట్ కవర్ ఇచ్చి వారిని ఓ ప్రశ్న అడగటం.. ఇలా ఎంతో కొత్తగా, సరదాగా ఈ వేడుక నడిచింది.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200